J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 40 సంచిక : 47 23.4.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## మన ప్రాణాలు.. మన చేతుల్లోనే!

# ధైర్యమే.. ఆయుధం



***అవును.. కరోనా రెండవ దశ కల్లోలాన్ని సృష్టిస్తోంది. కోట్లాది మందిని ఆసుపత్రుల పాలు చేస్తోంది. లక్షలాది ప్రాణాలను బలిగొంటోంది. ఇప్పుడు మనకు కావలసింది మనోధైర్యం, గుండె నిబ్బరం. చనిపోతున్న వారిని చూసి భయపడడం కన్నా, బతికి బాగవుతున్న వారిని చూసి ధైర్యం తెచ్చుకోవడం అవసరం. లక్షమందికి పాజిటివ్ వస్తే 1000 నుండి 1500 మంది మాత్రమే ప్రాణాలు కోల్పోతున్నారు. అంటే మరణించేవారి సంఖ్య 1 నుండి 1.5 శాతమే. మిగిలిన 98.5 శాతం మందిలో మనముండాలని కోరుకుందాం. మనకు మనమే భరోసా కల్పించుకుని ధైర్యమే ఆయుధంగా పోరాడదాం. కరోనాపై విజయం సాధించి తీరుదాం!..***

ఎక్కడ చూసినా.. ఎక్కడ విన్నా కరోనాయే. మనదేశంలోనే కాదు.. ప్రపంచమంతా కరోనా మాటే. ఈ మహమ్మారి వ్యాధి ప్రపంచాన్నే అంతగా వణికించేస్తోంది. కరోనా రెండోదశ కూడా వచ్చేసిందని, మాయలమారి వేషాలన్నీ వేస్తూ ఎవరి కంటికీ కనిపించకుండా సూక్ష్మరూపంలో వైరస్‌గా వచ్చి.. అందరినీ వరసబెట్టి చంపిపారేస్తోందని అందరూ అనుకుంటున్న మాటే. నిజమే ఇప్పుడు ప్రపంచమంతా అదే పరిస్థితి. ఈనెల 21వ తేదీ నాటికి ప్రపంచదేశాల్లో మొత్తంగా 14 కోట్లా 37 లక్షల మందికి పైగానే జనానికి కరోనా సోకితే, అందులో 30 లక్షలా 61 వేల మంది దాకా చనిపోయారు. మరో కోటీ 83 లక్షల మంది ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. వీరిలో అత్యధిక శాతం మంది కోలుకునే దశలో ఉంటున్నారు కూడా. అదేవిధంగా మనదేశంలోనూ కరోనా కేసుల సంఖ్య కోటీ 56 లక్షలా 16వేలు దాటింది. ఈ వ్యాధితో మృతిచెందిన వారి సంఖ్య లక్షా 82వేలా 553కు చేరింది. ఇలా అన్నిదేశాల్లో రోజురోజుకీ కరోనా రెండోదశ ఒక పెద్ద కార్చిచ్చులా అంటుకుంటూ పోతోంది. ప్రపంచమంతా కోవిడ్ వైరస్ విషపుగాలులతో అల్లాడిపోతూ ఉంది. అట్లని కరోనా మనల్ని చంపేస్తోందని భయపడుతూ ఎంతకాలం బతుకుతాం?.. కరోనాని ఎదుర్కొని నిర్భయంగా బతికే సామర్థ్యం మనకు లేదా?... ఒక్కసారి అందరూ ఆలోచించాల్సిన విషయం ఇది. ఎందుకంటే కరోనాకి మందు లేదు. కరోనా రాకుండా నివారించే మార్గం కూడా లేదు. ఇప్పుడు కావాల్సిందల్లా మనోధైర్యం ఒక్కటే. గుండెనిబ్బరంతో దాన్ని ఎదుర్కోవాలి. ప్రభుత్వాలు పదేపదే చెప్తున్న కోవిడ్ నిబంధనలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అనుసరించాలి. అప్పుడే మనం కరోనాకు దూరంగా ఉండగలం.

10లో

## శ్రద్ధాంజలి



**శ్రీమతి మల్లెమాల రమణమ్మ గారు**

(లేట్ మల్లెమాల రాధాకృష్ణారెడ్డి గారి సతీమణి)

నిర్యాణం : 19.04.2021 సోమవారం

మాతృమూర్తిని కోల్పోయి శోక సముద్రంలో ఉన్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గారికి వారి కుటుంబసభ్యులకు మనోస్థైర్యాన్ని ప్రసాదించాలని దైవాన్ని కోరుకుంటూ..

రమణమ్మ గారి ఆత్మశాంతికై ప్రార్థిస్తున్నాం.

Value beyond Bricks
SMD HOMES
Bangalore | Tirupathi | Nellore



# క్రికెట్‌లో సత్తాచాటిన అల్లూరు జట్టు

అల్లూరు యువకులు క్రికెట్‌లో ప్రతిభ చాటుకుంటూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఇటీవల బోగోలు మండలంలోని ఎస్వీపాళెంలో జరిగిన అంతరజిల్లాల క్రికెట్ టోర్నీలో అల్లూరు పిజిఎం యూత్ జట్టు తన సత్తాచాటుకోవడం విశేషం. పోటీల్లో విజేతగా నిలిచిన ఈ జట్టు 20,116 రూపాయల బహుమతిని అందుకుంది. ఈనెల 18న బహుమతి ప్రదానోత్సవం జరిగింది. మొత్తం 64 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటే అల్లూరు ప్రథమస్థానం సాధించింది. అదేవిధంగా ఎస్వీపాళెం యూత్ ద్వితీయ స్థానం సాధించి 15,116 రూపాయల బహుమతిని, విడవలూరు మండలంలోని ఇసగానిపాళెం సాయి లెవన్ జట్టు తృతీయస్థానంలో నిలిచి రూ. 10,116లు, ఊటుకూరు జట్టు నాల్గవ స్థానంలో నిలిచి 7,116 రూపాయలు బహుమతులుగా అందుకున్నాయి. స్థానిక వైకాపా నాయకుడు ద్వారం వేణుగోపాల్‌రెడ్డి, నగదు బహుమతుల దాతలు మాజీ సర్పంచ్ కె.భవానితో పాటు సింహాద్రి, పి.వెంకటేష్, ఆర్.నాగార్జునరెడ్డి, ఐ. ప్రసాద్, జి.హరిబాబు పాల్గొని విజేతలకు బహుమతులందజేశారు.

### సంతపేటలో
# శ్రీ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు నగరంలోని సంతపేటలో కొలువైవున్న శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలకు ఈనెల 20న అంకురార్పణ జరిగింది. స్వామివారికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఈనెల 21వ తేది ఉదయం ధ్వజారోహణం, తిరిచ్చి ఉత్సవం నిర్వహించారు. ఆలయ ఈఓ దర్గయ్య, దేవస్థాన ధర్మకర్తల మండలి ఛైర్మన్ సునీల్‌బాబు తదితరులు ఈ ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు.

## వీరాంజనేయునికి విశేష పూజలు :

నెల్లూరు నగరంలోని మారుతీనగర్‌లో ఉన్న శ్రీ వీర అభయాంజనేయస్వామికి ఈనెల 20న విశేషపూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామికి పూజలు, పల్లకీసేవ నిర్వహించారు. అర్చకుడు గోపీస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజల్లో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

# దేశమంటే...!

కాలం దగా చేస్తున్నది
నిశ్శబ్దంగా చురకత్తులు
విసురుతున్నది
మనిషి –
ఆకురాలినంత ధ్వని ఆవహించి
మరణవాంఛాలంలోకి జారుకొంటున్నాడు
చెట్లు రోదించలేని నిస్సహాయతతో
'కోమా'లో బ్రతుకునీడుస్తున్నాయి
ఇది మనుషులు ఖాళీ చేస్తున్న దేశం
సామాన్లు సర్దుకొని వెళ్లిపోతున్న దు:ఖం
ఈ జీవితం నాది కాదంటూ
వేదనల రోదనలే దృశ్యాదృశ్యమైన ఉన్మాదస్థితి
ఈ శవాలగుట్టల జాతర్లలో
ఆత్మను చంపుకొని బ్రతకడం అంటే
దేనికి సంకేతంగా చెప్పుకోవాలి
అంతులేని శోకం మిన్నంటి
అపరిష్కృతంగా అనంతమవుతున్నది
ఈ గాయం మానని రాచపుండైంది
కళ్ళు పొడుచుకున్నా కానరాని నిశీథి
అంతా పరుచుకొన్నది
ప్రపంచానికి ప్రమాదఘంటికల
సమయం ఆసన్నమయింది
దేశమంటే మనుషులు కాదు
శవాల దిబ్బలూను..
దేశమంటే మృత్యుఘోష !



– చిన్ని నారాయణరావు
94402 02942

# మా సమస్యలు తీర్చండి సారూ!..

### – అంగన్‌వాడీల ఆందోళన

ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను తీర్చాలని కోరుతూ సూళ్ళూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు ఈనెల 19న సూళ్ళూరుపేటలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఇన్‌చార్జి సూపర్‌వైజర్లను తొలగించి రెగ్యులర్ సూపర్‌వైజర్లను నియమించాలని, అలవెన్స్‌ల బకాయిలు వెంటనే చెల్లించాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అంగన్‌వాడీ కార్యకర్తలకు వర్తింపజేయాలని కోరుతూ సిడిపిఓకు వినతిపత్రం ఇచ్చారు. ఈ ఆందోళనలో అంగన్‌వాడీల సమాఖ్య అధ్యక్షురాలు హైమవతి, సిఐటియు మండల కార్యదర్శి సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# తడలో కరోనా దడ

తడలో కరోనా వైరస్ దడ పుట్టిస్తోంది. ఈ మండలంలోని ఒక ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయునికి ఇటీవల కరోనా పాజిటివ్ రావడంతో ముందు జాగ్రత్తగా వైద్యసిబ్బంది విద్యార్థులందరికీ వైద్యపరీక్షలు చేశారు. ఆరు, ఏడు తరగతుల్లో 20 మంది విద్యార్థులుంటే వారిలో 11 మందికి కోవిడ్ సోకినట్లు నిర్ధారణ అయిందని మండల వైద్యాధికారి రవిరామ్ పేర్కొన్నారు. చిన్నారుల ఆరోగ్యపరిస్థితిని బట్టి వారిని నెల్లూరు పెద్దాసుపత్రికి తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

## విఎస్‌యు హాస్టల్ విద్యార్థులకు

వెంకటాచలం మండలంలోని కాకుటూరులో ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీ హాస్టల్ విద్యార్థులకు ఈనెల 19న కోవిడ్ పరీక్షలు చేయించగా వారిలో ముగ్గురికి కరోనా నిర్ధారణ అయినట్లు సమాచారం.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చేవూరు సుబ్బారావు డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని, పీఆర్సీ నివేదిక వెల్లడించి 2018 నుంచి అమలు చేయాలని, 20 వేలకు పైగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీచేయాలని కోరారు. ఆమేరకు ఈనెల 19న వెంకటాచలం తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు.

# అంకమ్మతల్లికి కుంకుమ పూజ

ఇందుకూరుపేట మండలంలోని మైపాడు గ్రామంలో కొలువైవున్న గ్రామదేవత అంకమ్మ తల్లి జాతర సందర్భంగా అమ్మవారికి ఈనెల 17న వేడుకగా కుంకుమపూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ప్రభాకర్‌స్వామి ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. గ్రామపెద్దలు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, సంగం మురళి, పల్లెంకొండ శ్రీనివాసులు పాల్గొన్నారు.

# పశుగ్రాసం పెంపకానికి దరఖాస్తులు పంపండి

ఉపాధి హామీ పథకంలో భాగంగా పశుగ్రాసం పెంపకానికి రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామిరెడ్డి తెలిపారు. ఆసక్తి కలిగినవారు పశు వైద్యులను సంప్రదించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా 1500 ఎకరాల్లో పశుగ్రాసాన్ని పెంచాలని లక్ష్యంగా నిర్ణయించామని, ఒక్కో మండలానికి 30 నుంచి 50 ఎకరాల లక్ష్యం ఉంటుందని, మూడేళ్లపాటు పెరిగే గడ్డి రకాలను రైతులు ఎంపిక చేసుకోవాలని తెలిపారు. జాబ్‌కార్డు లేనివారికి ఒక్కపేరుతో 25 సెంట్లు, కార్డు ఉంటే 2.5 ఎకరాలు పశుగ్రాసం కోసం ఎంచుకోవచ్చని తెలిపారు.

### కామాక్షితాయికి
# లక్ష కుంకుమార్చన

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున స్వామి సమేత శ్రీ కామాక్షితాయి అమ్మవారికి ఈనెల 19న ఆలయ అర్చకులు ఎంతో భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి శోభాయమానంగా అలంకరణలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

### 6 లక్షల ఎకరాల్లో
# పంటల సాగుకు ప్రణాళికలు

## రెండోపంట వేసేందుకు సిద్ధమవుతున్న రైతాంగం



జిల్లాలో సుమారు ఆరు లక్షల ఎకరాల్లో రెండోపంట సాగు చేసేందుకు రైతాంగం సిద్ధమవుతున్నారు. రెండో పంటకు సాగునీటి కొరత లేకపోవడం, జలాశయాల్లో నీరు పుష్కలంగా ఉండడంతో రైతులు ఎంతో ఉత్సాహంతో పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే జిల్లాలో ఈ రబీ సీజన్‌లో 4,51,085 ఎకరాల్లో వరికోతలు పూర్తికాగా 1,12,609 ఎకరాల్లో వరికోతలు జరుగుతున్నాయని అధికారుల అంచనా. ఇవి పూర్తికాగానే రెండోపంటకు సోమశిల జలాశయం కింద 3.84 లక్షల ఎకరాలకు, సంగం డెల్టా కింద 1.50 లక్షల ఎకరాలకు, నెల్లూరు డెల్టా కింద 50 వేల ఎకరాలు, కనుపూరు కాలువ కింద 66 వేల ఎకరాలు, కావలి కాలువ కింద 75 వేల ఎకరాలు, ఉత్తర కాలువ కింద 11,120, దక్షిణ కాలువ కింద 32 వేల ఎకరాలు, కండలేరు ప్రాజెక్టు కింద 90,848 ఎకరాలు, ఆయకట్టు స్థిరీకరణ కింద 1,14,520 ఎకరాలకు నీటిపారుదల అధికారులు సాగునీరు కేటాయించడంతో ఆయా ప్రాంతాల్లోని ఆయకట్టు రైతులు రెండోపంట సేద్యానికి సిద్ధమవుతున్నారు. జిల్లాలో మొత్తమ్మీద 6 లక్షల ఎకరాల్లో పంటల సాగుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారులు విత్తనాలకు కొరత లేకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

# పాఠశాలల్లో కరోనా కలవరం

### – ఇద్దరు టీచర్లకు, ఇద్దరు విద్యార్థులకు కోవిడ్

కోవిడ్ వైరస్ విపరీతంగా సోకుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పాఠశాలలనూ కరోనా మహమ్మారి భయపెడుతోంది. ఇటీవల విడవలూరులో ఇద్దరు టీచర్లకు, చేజర్ల మండలంలో ఇద్దరు విద్యార్థులకు కరోనా సోకడంతో బడులకు వెళ్ళాలంటేనే విద్యార్థులు, ఉపాధ్యాయులు హడలిపోతున్నారు. విడవలూరు మండలంలోని వడ్డిపాళెం, రేబాలకు చెందిన ఇద్దరు టీచర్లకు కరోనా నిర్ధారణ అయిందని ఎంఇఓ దిలీప్ తెలిపారు. వీరికి కరోనా లక్షణాలున్నట్లు తెలియడంతో పరీక్షలు చేయగా కరోనా సోకినట్లు నిర్ధారించడం జరిగిందన్నారు. దీంతో ఆ పాఠశాలలను శానిటైజ్ చేయించామని, విద్యార్థులకు కూడా కోవిడ్ పరీక్షలు చేయిస్తున్నామని పేర్కొన్నారు. అదే విధంగా చేజర్ల మండలంలోని పాడేరు పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు కరోనా సోకినట్లు మండల విద్యాశాఖ అధికారి పి.కళాధర్ పేర్కొన్నారు. దీంతో మిగిలిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కూడా కరోనా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.

## కాలధర్మం
# కాటంరెడ్డి వేణుగోపాలరెడ్డి



నెల్లూరు జిల్లా, బద్వేల్ వెంకన్నపాలెం వాసి, ఆ తర్వాత హైదరాబాదులో స్థిరపడ్డ కాటంరెడ్డి వేణుగోపాలరెడ్డి తన 83వ యేట కన్నుమూశారు. ఏప్రిల్ 13వతేదీ మంగళవారం నాడు ఉగాది పర్వదినాన ఆయన తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య హంసవేణి, కుమార్తెలు ప్రశాంతి, లక్ష్మీప్రసన్న, ప్రవీణ ఉన్నారు.

వేణుగోపాలరెడ్డి 1966 జులై13వ తేదీన మద్రాసులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) నుండి కెమికల్ ఇంజనీరింగ్‌లో పట్టా పుచ్చుకున్నారు. డిగ్రీ పుచ్చుకున్న అనతికాలంలోనే 1966, డిసెంబర్ 19న హైద్రాబాదులో కేంద్ర ప్రభుత్వ అధీనంలో పనిచేస్తున్న ఇండియన్ డ్రగ్స్ & ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్(ఐడిపియల్)లో చిరుద్యోగంలో చేరారు. అంచెలంచెలుగా ఎదిగి, అదే శాఖలో డిజైన్, డెవలప్మెంట్ & ప్రాసెస్ విభాగంలో మేనేజర్ హోదాలో 1995 అక్టోబర్ 7వ తేదీన స్వచ్ఛంధ పదవీ విరమణ చేశారు. 29 సంవత్సరాల పాటు ఐడిపియల్‌లో వివిధ హోదాలలో ఆయన తన సేవలందించారు.

ఆరోగ్యమే మహాభాగ్యమనే సూత్రాన్ని వేణుగోపాలరెడ్డి ఎక్కువగా పాటించేవారు. హోమియోపతి, ఆయుర్వేదం వంటి విభాగాలతోపాటు మాగ్నటిక్ థెరపీ వంటి పలు సహజ విధానాలను ఆయన అనునిత్యం అనుసరించడమే కాకుండా ఇతరులకు కూడా సూచించేవారు.

1966 సెప్టెంబర్ 16న వేణుగోపాలరెడ్డి అక్కా సోదరుల సోదరి హంసవేణిని పెళ్ళాడి అక్కా రంగారెడ్డి – కామేశ్వరమ్మల అల్లుడయ్యారు. తన రెండవ కుమార్తె లక్ష్మీప్రసన్నను అక్కా శివనారాయణరెడ్డి జీవిత భాగస్వామిని చేసి మళ్ళీ రంగారెడ్డికి వియ్యంకుడిగా కూడా మారారు.

కొద్దికాలంగా స్వల్ప అనారోగ్యంతో ఉంటూ, హైదరాబాదులోని తన రెండవ కుమార్తె వద్ద ఆయన కాలం చేశారు. వేణుగోపాలరెడ్డి మృతికి నివాళులర్పిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

• తిరుపతి పార్లమెంటు

# ఉపఎన్నిక జరిగింది.. కరోనా పెరిగింది

***మొత్తానికి కిందా మీదా పడి అన్ని ప్రధాన పార్టీలు తిరుపతి ఉపఎన్నికల తంతుని ముగించాయి. ఏప్రిల్ 17వతేదీ పోలింగ్ కావడంతో 15వతేదీ వరకూ అన్ని పార్టీల నాయకులు బరితెగించి ఊళ్ళ మీద పడ్డారు. అప్పుడు వీళ్లెవరికీ కరోనా గుర్తుకు రాలేదు. వీళ్ళ మీటింగులు, రోడ్డు షోల పుణ్యమే ఇప్పుడు చిత్తూరు, నెల్లూరు జిల్లాలు ఎక్కువ సంఖ్యలో కరోనా కేసులతో అల్లాడిపోతున్నాయి.***

మే 2వ తేదీన ఫలితాలు రానున్నాయి. ఆ రోజుకి కరోనా లెక్కలు కూడా ఏ స్థాయిలో ఉంటాయో చూడాలి. పార్టీలు తమకు పడ్డ ఓట్లు, వచ్చిన మెజారిటీ లెక్కలలో మునిగి పోతే, కరోనా కూడా అప్పటికి తన ప్రతాప ఫలితాలను రుచి చూపిస్తుంది. నేతల జాతకాలు ఇవియంలలో భద్రంగా ఉన్నాయి. వీళ్ళ పుణ్యమా అంటూ కరోనా బారినపడ్డ ప్రజల ప్రాణాలు మాత్రం ఆసుపత్రులలో కొట్టుకుంటున్నాయి.

## ఫలితాలపై ఎవరి ధీమా వారిదే...

వైసిపి మెజారిటీపై లెక్కలు వేసుకుం టోంది. బీజేపీ టీడీపీలు మాత్రం పైకి తమదే గెలుపని ఊదరగొట్టినా లోలోపల మాత్రం రెండవ స్థానం ఎవరిదన్న మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నాయి. అధికారపార్టీతో సహా ఏ ఒక్క పార్టీ కూడా ఈ ఉపఎన్నికను ఆషామాషీగా తీసుకో లేదు. అధినేతలతో సహా మొత్తం సైన్యం అంతా దిగి పోరాడారు. అధికారపార్టీలో మాత్రం రాజు మినహా మిగిలిన వారు మొత్తం తిరుపతి నెల్లూరులలో మోహ రించారు. సర్వశక్తులూ ఒడ్డి పోరాడారు. గురుమూర్తి మెజారిటీ 5 లక్షలు దాటాలని టార్గెట్ పెట్టుకుని పనిచేశారు. ఓట్ల శాతం తగ్గింది. కేవలం 64.29 శాతం మాత్రమే పోలయ్యాయి. పార్టీలిచ్చే పొట్లాల కోసం, క్వార్టర్ బాటిళ్ల కోసం కక్కుర్తిపడి తండోప తండాలుగా తరలివచ్చిన ప్రజలు ఓటింగ్ కోసం మాత్రం అంతంతమాత్రంగానే వచ్చారు. గతంతో పోలిస్తే 15శాతం తక్కువ, అప్పట్లో రెండు లక్షల 30వేలకు చేరువగా వచ్చిన మెజారిటీ ఇప్పుడు 5 లక్షలు దాటాలంటే ఆషామాషీ కాదు, ఎన్నిక ఏకపక్షమై ఉండాలి. మే 2 వరకు వేచిచూద్దాం, ఓటరు తీర్పు ఎలా ఉందో...!

# వాడవాడలా శ్రీరామనవమి



శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా జిల్లావ్యాప్తంగా వాడ వాడలా శ్రీరామనవమి వేడుకలు జరిగాయి. విశేష అలంకారాలు, విశిష్ట పూజలు నిర్వహించారు. కరోనా నేపథ్యంలో ఈసారి ఏకాం తంగా స్వామివార్లకు విశేష పూజలు చేశారు.

## శబరి శ్రీరామక్షేత్రంలో :

నెల్లూరులోని శబరి శ్రీరామక్షేత్రంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఏకాం తంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు నరేష్ ఆచార్యులు శాస్త్రోక్తంగా స్వామివార్ల కల్యాణోత్సవం నిర్వహించగా, వ్యాఖ్యాతగా టీటీడీకి చెందిన వేద పండితుడు సాయినాథా చార్యులు వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ స్వచ్ఛంధ సంస్థల ఐక్యవేదిక, గీతామయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను అందచేశారు. జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ దంపతులు, శబరి శ్రీరామక్షేత్ర పర్యవేక్షకులు చేజర్ల వెంకటేశ్వరరెడ్డి దంపతులు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ పిడూరు కిషోర్‌రెడ్డి, సభ్యులు చంద్రారెడ్డి, సుబ్బరాజు, తదితరులు స్వామివార్లను దర్శించుకున్నారు.

## నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం

నెల్లూరు నగరంలోని 53వ డివిజన్‌లో ఉన్న గాంధీ గిరిజన కాలనీలో కొలువై ఉన్న శ్రీ సీతారాముల దేవస్థానంలో ఈనెల 21న కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు వెంకటరమణ, వెంకయ్య, రవి, శ్రీనివాసులు, తిరుమలయ్య పాల్గొన్నారు.

ఏ సమస్య ఉన్నా

# ఫోన్ చేయండి

**- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న**



కరోనా మహమ్మారి వాధిని నివా రించేందుకు ప్రతిఒక్కరూ సహకరించా లని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు. కోవిడ్ తగ్గుముఖం పట్టేదాకా తనను కూడా ఎవరూ నేరుగా కలవవద్దని సూచించారు. ముఖ్యమైన పనులకోసం, ప్రజా సమస్యల పరిష్కారానికి తనకు ఎప్పు డైనా సరే.. 9989649999 నెంబర్‌కు ఫోన్ చేయొచ్చని చెప్పారు. ఫోన్‌లో అంద రికీ తాను అందుబాటులో ఉంటానన్నారు. కరోనా నివారణకు ప్రతిఒక్కరూ తప్ప కుండా మాస్కులు ధరించడంతో పాటు భౌతికదూరాన్ని పాటించాలన్నారు. ముఖ్యంగా కరోనా నిరోధానికి ప్రతిఒక్కరూ వ్యాక్సిన్ వేయించుకోవాలని కోరారు.

# వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి మాతృ వియోగం



రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సతీమణి, తిరుమల తిరుపతి దేవస్థానాల ట్రస్టు బోర్డు సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాతృమూర్తి మల్లెమాల రమణమ్మ ఏప్రిల్ 19వతేదీ సోమవారం రాత్రి చెన్నైలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో కన్నుమూశారు. ఆమె వయస్సు 80 సంవత్సరాలు. గుండె సంబం ధిత వ్యాధితో ఆమె గత కొంతకాలంగా బాధపడుతున్నారు. ఆమె భర్త మల్లెమాల రాధాకృష్ణారెడ్డి గత ఏడాది ఆగస్టులో పరమపదించారు.

భర్త దూరమై ఏడాది గడవకముందే రమణమ్మ కూడా దైవ సాన్నిధ్యం పొందారు. ఆమెకు ఒక కుమార్తె, ఒక కుమారుడు. కుమారుడు చాలాకాలం క్రితం రోడ్డు ప్రమాదంలో అసువులు బాయడంతో వృద్ధ దంపతులిద్దరూ నెల్లూరులో కుమార్తె ప్రశాంతిరెడ్డి దగ్గరే వుండేవారు.

శ్రీకాళహస్తి సమీపంలోని పునబాక ఈ దంపతుల స్వగ్రామం. బిడ్డల చదువుల కోసం, వారి ఉన్నత భవిష్యత్తు కోసం తిరుపతికి తమ నివాసం మార్చుకున్నారు. పిల్లల చదువులు, పెళ్లిళ్ల తరువాత నెల్లూరుకు వచ్చి స్థిరపడిపోయారు. రమణమ్మకు దైవచింతన ఎక్కువ, నిత్యం భగవత్ ధ్యానంలో ఉండేవారు. భర్త రాధాకృష్ణారెడ్డి చేసే వ్యాపార వ్యవహారాలలో కూడా ఆమె తనవంతు సహాయసహకారాలను అందించే వారు. భర్త మరణంతో మనోవ్యధకు గురై అప్పటినుండి అస్వస్థతతో ఉన్నారు.

జన్మనిచ్చిన నాన్న - అమ్మ ఇద్దరూ ఏడాది కాలంలో దూరం కావడంతో శోక సముద్రంలో ఉన్న ప్రశాంతమ్మకు మనోస్థైర్యాన్ని ఇవ్వాలని శ్రీ వేంకటేశ్వరుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.




ఉత్తరక్రియలు

మా దైవం, మా ఇంటి దీపం

శ్రీ ఆరుగుంట కోదండరామిరెడ్డి గారు

తే.19.04.2021ది సోమవారం రాత్రి పరమపదించారు.

వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

ఆరుగుంట కృష్ణవేణి - భార్య

కుమారుడు - కోడలు

ఆరుగుంట శరత్‌కుమార్‌రెడ్డి - నిఖిల

కూతురు - అల్లుడు

తరిమెల ప్రశాంతి - శ్రీకాంత్

మనుమరాళ్ళు

ఆరుగుంట ప్రషన్నరెడ్డి, తరిమెల ప్రవల్లిక

మనుమడు - ఆరుగుంట సాయి వరిష్‌రెడ్డి

మరియు బంధుమిత్రులు

ఉత్తరక్రియలు : వారి ఉత్తరక్రియలు(పెద్దకర్మ) తే.29.04.2021ది గురువారం ఉదయం 10గంటలకు బంజారాహిల్స్, హైదరాబాదులోని వారి స్వగృహము నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

## 'ప్రభా'తం


# కోవిడ్ వ్యర్థాలతో జాగ్రత్త



ఒక్క కోవిడ్‌తోనే కాదు, నిర్లక్ష్యం చేస్తే కోవిడ్ వ్యర్థాలతోనూ ముప్పు తప్పదంటున్నారు నిపుణులు. ఆసుపత్రుల్లో కోవిడ్ చికిత్సలు చేసిన తర్వాత వాడేసిన దూది, సిరంజిలు, కట్టుగుడ్డలు, గ్లౌజులు, మాస్కులు వగైరాలన్నీ ఎక్కడంటే అక్కడ కుప్పలుతెప్పలుగా పడేస్తుండడం ప్రమాదకరమని, మనదేశంలో కూడా ఇలాంటి వ్యర్థాలు ప్రతిరోజూ టన్నులకొద్దీ గుట్టలుగా పడుతున్నాయని, ఇదెంతో ఆందోళన కలిగించే అంశమని వారు హెచ్చరిస్తున్నారు. ఇకనైనా ప్రాణాంతకమైన కోవిడ్ వ్యర్థాలను సరైన రీతిలో నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వాలు, స్వచ్ఛంధసంస్థలు, మేధావులు, ప్రజలు అందరూ సమిష్టిగా కృషిచేయాల్సివుంది.

అసలే కరోనా కార్చిచ్చులాగా వ్యాపిస్తోంది. కోవిడ్ వైరస్ ప్రపంచాన్ని అతాకుతలం చేస్తూనే ఉంది. ఈ మహమ్మారి వ్యాధి రకరకాల రూపాలతో అవతరించి ప్రజల ప్రాణాలు తీసే భయంకర వ్యాధిగా సకల మానవాళినీ బెంబేలెత్తిస్తోంది. ఇప్పటికే ఈ మాయదారి వ్యాధికి ప్రపంచంలో దాదాపు పద్నాలుగు కోట్లమందికి పైగానే నరకయాతన పడుతున్నారు. సుమారు 30 లక్షలా 50 వేల మందికి పైగానే మృత్యువాతపడ్డారు కూడా. మనదేశంలోనూ ఈ వ్యాధి బారిన పడి నానా బాధలు పడుతున్న వారి సంఖ్య రెండు కోట్లకు చేరువలోకి వస్తోండగా, ఇప్పటికే లక్షా 80వేల మందికి పైగానే ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరం. ఇలా నిత్యం వేలాది మందిని చంపుకుతింటున్న ఇంతటి భీకరమైన రాకాసి వ్యాధిని ఇంతవరకు ప్రపంచం కనీవినీ ఎరుగదు కూడా. అందులోనూ రెండోదశలో కోవిడ్ కేసులు సునామీలా దేశాన్ని చుట్టుముట్టి పీడిస్తున్నాయి. బాధితుల సంఖ్య ఇప్పుడు రోజురోజుకీ లక్షల సంఖ్యలో పెరిగిపోతూనే ఉండడంతో ప్రజలు హడలిపోతున్నారు. దేశంలో కరోనా కరాళనృత్యం చేస్తుండడంతో బాధితులు ఊపిరితిత్తులు అరచేతుల్లో పెట్టుకుని పోలోమంటూ ఎవరి శక్తికి తగ్గట్టు వారు ఏ ప్రైవేటు, లేదా ప్రభుత్వాసుపత్రుల్లోనే చేరి ప్రాణాలు నిలబెట్టుకునేందుకు పరుగులు తీస్తూనే ఉన్నారు. దీంతో ఆసుపత్రుల్లో చేరేవారి సంఖ్య రోజురోజుకీ పెద్దఎత్తున పెరిగిపోతూనే ఉంది. ఈ నరకం ఇలా ఉంటే, ఒక్క కోవిడ్‌తోనే కాదు, మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టుగా.. కోవిడ్ వ్యర్థాలతో కూడా ముప్పు వాటిల్లే పరిస్థితులు అందరిలోనూ ఆందోళన కలిగిస్తున్నాయి. ఆసుపత్రుల్లో చికిత్సలు చేసిన తర్వాత వాడేసిన దూది, సిరంజిలు, కట్టుగుడ్డలు, గ్లౌజులు, మాస్కులు వగైరాలన్నీ ఇప్పుడు కుప్పలుతెప్పలుగా పడుతున్నాయి. ఇలాంటి వ్యర్థాలన్నీ కలసి వెరసి టన్నుల కొద్దీ పేరుకుపోతుండడం ఆందోళన కలిగిస్తోందని నిపుణుల నివేదికలు వెల్లడిస్తున్నాయి. మనదేశంలో ఇలాంటి వ్యర్థాలు రోజుకు సుమారు 140 టన్నులకు పైగానే గుట్టలు పడుతున్నాయన్నది తాజా పరిశీలనలు పేర్కొంటున్నాయి. ప్రయోగశాలలు, వైద్యసంస్థలు, ఆసుపత్రుల ప్రాంగణాల్లో పేరుకుపోతున్న ఈ వ్యర్థాలను సక్రమమైన రీతిలో నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వాలు ఎన్నో మార్గదర్శకాలను సూచించినా ఆశించిన స్థాయిలో అవి ఆచరణలోకి రాకపోవడం విచారకరం. అసలే అది కోవిడ్ వైరస్..ప్రాణాలు తీస్తున్న మహమ్మారి వైరస్.. దీనికి సంబంధించిన ఏ వస్తువును ముట్టుకున్నా ప్రమాదకరమే. అలాంటి వ్యర్థాలను ఎంతో జాగ్రత్తగా, ఎవరికీ ప్రమాదం లేకుండా సురక్షిత పద్ధతుల్లో ఏరివేసి వాటిని నిర్మూలించే విషయంలో ఏ మాత్రం అజాగ్రత్త పనికిరాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కరోనా అనుక్షణం ప్రబలిపోతుండడంతో ఆసుపత్రుల్లోనూ, హోం క్వారంటైన్‌లలోనూ బాధలు పడుతూ రోజుల తరబడి చికిత్సలు చేసుకునే వారుంటారు. మందులు, ఇంజెక్షన్లు వగైరా కోవిడ్ నివారణ సామగ్రి కూడా భారీ ఎత్తున ఉంటుంది. అందువల్ల కోవిడ్ చికిత్సలకు ఉపయోగపడే పరికరాలను లేదా సామగ్రిని ఎంత అప్రమత్తంగా వినియోగించుకుంటున్నామో.. వాటిని వాడేసిన తర్వాత ఆ వ్యర్థాలను కూడా ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా క్రమబద్ధంగా, ప్రభుత్వాలు సూచిస్తున్న మార్గదర్శకాల ప్రకారం నిర్వీర్యం చేయాల్సి ఉంటుంది. వాడేసిన మాస్కులు, గ్లౌజులు, పిపిఇ కిట్‌ల వంటి వాటిని పారేసేముందు కనీసం 72 గంటల పాటు విడిగా ఉంచాలి. ఆ తర్వాతనే వాటిని పారేయాలి. ఆ పారేయడంలో కూడా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన డబ్బాల్లో వేసి పారేయాలి. ఇలా కోవిడ్ వ్యర్థాల నిర్మూలనకు సంబంధించి ఎన్నో నియమ నిబంధనలున్నాయి. అయితే అనేకమంది వాటిని పట్టించుకోవడం లేదనే అభిప్రాయాలు సర్వత్రా ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికే ఆసుపత్రుల ప్రాంగణాలు, కొన్నిచోట్ల వీధుల్లో కూడా వాడేసిన మాస్కులు వగైరా వ్యర్థాలు చిత్తం వచ్చిన రీతిగా పడేస్తుండడం మనం చూస్తూనే ఉన్నాం. దీనివల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలుగుతుందని, ఒక్కోసారి అది ప్రాణాల మీదికి కూడా వచ్చే అవకాశం లేకపోలేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కోవిడ్ వైరస్ గాలిలో కూడా వ్యాపిస్తూ అంతటా విజృంభిస్తున్న ఈ తరుణంలో కోవిడ్‌కు సంబంధించిన ప్రతి అంశాన్ని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా పరిశీలించుకోవాలి. వీధుల్లోనూ, ఇళ్ళ దగ్గర ఎక్కడంటే అక్కడ వాడేసిన కోవిడ్ వ్యర్థాలను పడేయకుండా సురక్షితమైన పద్ధతుల్లో వాటిని పారేయాలి. ఏ చెత్తాచెదారాన్నయినా, ఎలాంటి వ్యర్థపదార్థాలనైనా వీధిలో పారేస్తే పారిశుద్ధ్య కార్మికులు తీసుకువెళ్తారనే నిర్లక్ష్యాన్ని ఇకనైనా వీడాలి. ప్రాణాలకు సైతం తెగించి ఇలాంటి వ్యర్థాలని, కోవిడ్ భీకరరూపం దాల్చిన ఈ తరుణంలో మన ఇళ్ళ వద్దకు వచ్చి మనం వేసిన చెత్తా చెదారాలని తీసుకువెళ్లే పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యాన్ని కూడా పరిరక్షించాల్సిన నైతిక బాధ్యత మనందరిపైనా ఉంది. ఈ వ్యర్థాల ఏరివేతను క్రమబద్ధంగా నిర్వహించడం ఒక సామాజిక బాధ్యతగా గుర్తించేవిధంగా ప్రభుత్వాలు ప్రజల్లో చైతన్యం కలిగించాలి. అందుకు ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంధసంస్థలు, నిపుణులు, అధికారులు, మేధావులు అందరూ కలసి కోవిడ్ వ్యర్థాలను కట్టుదిట్టమైన పద్ధతుల ద్వారా నిర్వీర్యం చేసే బృహత్తర కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా చేపట్టాల్సి ఉంది. కోవిడ్ వైరస్‌ను పూర్తిస్థాయిలో నివారించే కార్యక్రమంలో భాగంగా ఇలాంటి సూక్ష్మమైన అంశాలను కూడా అందరూ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది.

# ముదివర్తి కొండమాచార్యులు.. కన్నుమూత



ప్రముఖ పండితుడు, టీటీడీ ప్రచురణల విభాగం మాజీ ఉద్యోగి విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు ఈనెల 16న ఆయన స్వస్థలమైన గూడూరులో కన్నుమూశారు. మాలవ్యానగర్‌లో తన అల్లుడు జగన్నాథాచార్యుల ఇంటిలో ఆయన వృద్ధాప్య సమస్యలతో అస్వస్థులై తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 93 సంవత్సరాలు. ప్రఖ్యాత కవిగా, కొండమాన్ దేశికులుగా ముదివర్తి కొండమాచార్యులు ప్రసిద్ధులు.

1923 సెప్టెంబర్‌లో జన్మించిన ఆయన మద్రాసు విశ్వవిద్యాలయంనుంచి విద్వాన్ పట్టా పొందారు. అనంతరం 30 ఏళ్ల పాటు నెల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానాంధ్ర పండితులుగా పనిచేశారు. పదవీవిరమణ అనంతరం 1980 నుంచి 2014 వరకు తిరుమల తిరుపతి దేవస్థానంలో పుస్తక ప్రచురణల విభాగంలో 34 ఏళ్ల పాటు గ్రంథ పరిష్కర్తగా వ్యవహరించారు. శ్రీ వేంకటేశ్వరస్వామిపై అనన్యభక్తితో అనేక పుస్తకాలను, కవితలను, పద్యాలు, పాటలను రచించి భక్తకవిగా కీర్తి గడించారు. ఆయన పద్యకవి. ధర్మదీక్షతో కవితావ్రతం ప్రారంభించి యాభైకిపైగా పద్య గద్య కృతులు ప్రచురించారు. తాళ్లపాక కవుల ఆధ్యాత్మిక కీర్తనలతో 1500 పదాలను సీసపద్యాలుగా ప్రకటించారు. వీరి రచనలు ఎంతో ప్రఖ్యాతిగాంచాయి. అనేక వర్సిటీలు పాఠ్య గ్రంధాలుగా నిర్ణయించాయి. వీరి రచనలపై శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పరిశోధనలు జరి గాయి. టీటీడీ ప్రచురించిన భారత, భాగవతాది గ్రంధాలలో కొన్ని భాగాలకు వీరు వ్యాఖ్యానం కూడా రాశారు. 2006లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి ప్రతిభా పురస్కారం, 2007లో అనంతలక్ష్మీకాంత సాహితీ పురస్కారం, కవిశేఖర, విద్వత్కవి శిరోమణి, మహాకవి వంటి బిరుదులెన్నో కొండమాచార్యులను వరించడంతో పాటు ఆయన లెక్కకుమించి సన్మానాలు పొందారు. కవితారంగంలో కీర్తి గడించి సింహపురి సీమకే గర్వకారణంగా నిలిచిన ముదివర్తి కొండమాచార్యులు మృతితో జిల్లావ్యాప్తంగా ఆయన అభిమానుల్లోను, గూడూరు పట్టణంలోను విషాదఛాయలు అలుముకున్నాయి.

## టీపీటీ, హెచ్‌పీటీ పరీక్షలు 26 నుంచి

భాషా పండిట్ ట్రైనింగ్ కోర్సుల (టీపీటీ, హెచ్‌పీటీ) పరీక్షలు ఈ నెల 26వ తేదీ నుంచి 30 వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్‌టిక్కెట్లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకొని ప్రిన్సిపాళ్ళతో ధృవీకరించుకోవాలని, పరీక్షకు ఏవైనా ధృవీకరణ కార్డు తీసుకురావాలని సూచించారు.

## కరోనాతో.. విద్యుత్ ఏఇ హనుమారెడ్డి కన్నుమూత

విద్యుత్‌శాఖలో ముత్తుకూరు సెక్షన్ ఏ.ఇగా పనిచేస్తున్న బి.హనుమారెడ్డి (42) ఈనెల 18న కరోనాతో కన్నుమూశారు. ఇటీవల ఆయనకు కోవిడ్ సోకడంతో చెన్నైలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడంతో ఆయన కుటుంబసభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. హనుమారెడ్డి ఉత్తమ అధికారిగా మంచిపేరు తెచ్చుకున్నారని, ఆయన మరణం తమకెంతో బాధను కలిగిస్తోందని విద్యుత్‌శాఖ ఎస్‌ఇ ఆదిశేషయ్య పేర్కొంటూ, ఆయన కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని ప్రకటించారు.

## అగ్నిబాధితుని కుటుంబానికి సాయం

నెల్లూరు రూరల్ మండలంలోని గుడిపల్లిపాడులో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధితుడు ముత్తుకూరు సురేష్ కుటుంబానికి 2వ డివిజన్ వైకాపా నాయకుడు పి.రామ్మోహన్ 10వేల రూపాయలు సాయం అందజేశారు. ఆ కుటుంబ అవసరాలకు బియ్యం కూడా ఇచ్చారు. వైకాపా నాయకులు సి హెచ్ శివరామయ్య, వై. వెంకటరత్నం, పి. మల్లి, ఎం.మల్లి తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు రోడ్లు బాగుపడేదెప్పుడు?




నెల్లూరు నగరం సుందర నందనవనంగా అవుతుందేమోనని ఎంతో కాలంగా నిరీక్షిస్తున్నాం. కానీ, ఏళ్ళు గడిచిపోతున్నాయే తప్ప ఎలాంటి ప్రయోజనం కనిపించడం లేదు. ఎప్పటికప్పుడు నాయకులు గొప్పగా ప్రకటనలు చేస్తూ నెల్లూరును తీర్చిదిద్దుతామని చెప్తుంటారే గాని, ఆచరణలో ఆ మాటలన్నీ నీటి మూటలుగానే మిగిలిపోతున్నాయి. నగరంలో అనేక ముఖ్యమైన ప్రాంతాలూ, కూడళ్ళు, జనసమ్మర్దంగా ఉండే ప్రాంతాల్లో కూడా రోడ్లు పరమ అధ్వాన్నంగా ఉంటున్నాయి. గులక, తారు లేచిపోయి కొన్ని చోట్ల రోడ్లు మట్టిరోడ్ల కంటే ఘోరంగా ఉన్నాయి. గత ప్రభుత్వంలో ఈ రోడ్లను భలేగా బాగుచేస్తారని అనుకున్నాం గానీ, ఆ పనులన్నీ అర్ధాంతరంగానే, అస్తవ్యస్థంగానే ముగిసిపోయాయి. రోడ్లల్లో ఏర్పడిన గుంతలకు కనీసం ప్యాచ్ వర్కులు చేసేవాళ్ళు కూడా ఇప్పుడు కనిపించడం లేదు. దీంతో వాహనాల రాకపోకలకు ఎంతో ఇబ్బందిగా ఉన్నా పట్టించుకునే అధికారులు గాని, నాయకులు గానీ లేరు. ఇంకా ఎంతకాలం ఈ దుస్థితి భరించాలో తెలియడం లేదు. ఇప్పుడు వేసవి కాలం కనుక రోడ్ల మరమ్మతులకు ఆటంకాలు పెద్దగా ఉండవు! ఇప్పటికైనా ఆ పనులు మొదలుపెడితే మంచిది! జిల్లా ఉన్నతాధికారులు, ఇంజనీర్లైనా పట్టించుకుంటారని ఆశిద్దాం!

*బి.సుబ్బరామయ్య,* **బాలాజీనగర్, నెల్లూరు.**

## ఔను.. ఉచితాలు అనుచితమే!

ఎన్నికలొచ్చినప్పుడల్లా నాయకులు లేనిపోని వాగ్దానాలు చేస్తూ ఎన్నో రకాల ఉచిత పథకాలను మీకందిస్తామంటూ హామీలివ్వడం అమాయక ప్రజల ఓట్లను కొల్లగొట్టడానికి కాక మరింకేమిటి? ఉచిత హామీలు ఎప్పటికీ సముచితం కాదు. అలాంటి ఉచిత పథకాలపై మద్రాసు హైకోర్టు ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేయడాన్ని... రాజకీయ పార్టీల 'ఆల్‌ఫ్రీ' హామీలు విమర్శలపాలవుతున్న వైనాన్ని గత వారం 'లాయర్'లో రాసిన కథనాలు వాస్తవాలను ప్రతిబింబిస్తున్నాయి. తమిళనాడులో నాయకుల ఉచిత హామీలను గమనిస్తే... ఎంతో ఆశ్చర్యం అనిపిస్తుంది. సామాన్య ప్రజలు ఆ ఉచితాల మాయలో పడరని గ్యారంటీ ఏమీ లేదు. అందువల్లనే హైకోర్టు ఇలాంటి ప్రలోభాల పట్ల మండిపడుతూ, ఉచిత హామీలను అవినీతి వ్యవహారంగా పరిగణించాల్సిన అవసరం కూడా ఉందని చెప్పడం ఎంతో సరైనదే! ఒక్క తమిళనాడులోనే కాదు, మన రాష్ట్రంలోనూ ఇతర రాష్ట్రాల్లోనూ ఎక్కడైనా సరే.. ఓట్లకు గాలం వేసే ఉద్దేశ్యంతో ఇచ్చే ఉచిత పథకాల హామీలను ఎవ్వరూ నమ్మకూడదు. అలాంటి ప్రలోభాలకు ఎవ్వరూ లొంగిపోకూడదు. అప్పుడే ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుంది.

*ఎల్. హేమలత,* **బోగోలు.**

# కలసికట్టుగా కోవిడ్‌ను నియంత్రించాలి



## - గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్

రోజురోజుకు విజృంభిస్తున్న కరోనా వ్యాధిని కట్టడి చేసేందుకు విశ్వవిద్యాలయాలు, స్వచ్ఛందసంస్థలు, ప్రజలు అంతా కలసికట్టుగా పనిచేయాలని రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ విశ్వవిద్యాలయాల వారికి సూచించారు. నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య రొక్కం సుదర్శన రావుతో గవర్నర్ ఈనెల 20న ఆన్‌లైన్ మాధ్యమంలో మాట్లాడుతూ కరోనాపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆ కృషిలో విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, అధ్యాపకుల, విద్యార్థులంతా భాగస్వాములు కావాలని సూచించారు. కరోనా నిబంధనలు పాటించడం, మాస్కు ధరించడం వంటివన్నీ ఎంతముఖ్యమో ప్రజలకు చెప్పాలన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీలు కరోనా నియంత్రణ కోసం పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నాయని, స్థానిక సంస్థల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఉన్నత విద్యామండలి ఛైర్మెన్ హేమచంద్రరెడ్డితో పాటు అన్ని విశ్వవిద్యాలయల ఉపకులపతులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలోనే...

# నెల్లూరులో ఎక్కువ కరోనా కేసులు



## హెల్త్ ఎమర్జన్సీ ప్రకటించండి

### - సిఎం వైఎస్ జగన్‌కు సోమిరెడ్డి లేఖ

### • స్పందించిన వైద్యఆరోగ్యశాఖ మంత్రి ఆళ్ళ నాని

రాష్ట్రంలో ఎక్కువ కోవిడ్ కేసులు నెల్లూరులోనే నమోదవుతున్నాయని, ప్రభుత్వం వెంటనే పరిశీలించి పరిస్థితి చేయిదాటిపోకుండా వెంటనే తగు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాజీమంత్రి, టిడిపి నాయకుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఈనెల 21న లేఖ రాశారు.

నెల్లూరు పెద్దాసుపత్రిలో అన్ని బెడ్‌లపై ఉన్న బాధితులకు వెంటనే వైద్యసేవలం దించేలా చూడాలని, ఆ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వెంటిలేటర్లను తాత్కాలికంగా ప్రైవేటు ఆసుపత్రులకు పంపి ఉచితంగా వైద్యసేవలందించాలని ఆయన కోరారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా అవసరమైన సిబ్బందిని వెంటనే నియమించాలని, నెల్లూరులో మెరుగైన వైద్యసేవలందక ఎంతోమంది బాధితులు లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టుకుని అప్పులపాలవుతున్నారని, ఆరోగ్యశాఖ మంత్రి నేతృత్వంలో ఒక కమిటీని వెంటనే నెల్లూరుకు పంపి పరిస్థితులను చక్కదిద్దాలని ఆయన సూచించారు.

అందుకు స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశాఖ మంత్రి ఆళ్ళ నాని కన్వీనర్‌గా అయిదుగురు మంత్రులతో కోవిడ్ నివారణకు ఒక కమిటీని కూడా నియమించడం విశేషం. ఈ విషయమై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆళ్ళ నాని మాట్లాడుతూ, రాష్ట్రంలో కోవిడ్ నివారణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నిరకాల చర్యలను ఎంతో కట్టుదిట్టంగా చేపట్టారని తెలిపారు. నెల్లూరుజిల్లాలో కూడా కోవిడ్ కట్టడికి తీసుకుంటున్న చర్యలను ఆయన ఈ సందర్భంగా వివరించారు. అంతేకాదు, నెల్లూరుజిల్లాలో కరోనా కల్లోలాన్ని నివారించేందుకు జిల్లా యంత్రాంగాన్ని, వైద్య ఆరోగ్యశాఖ అధికారులను అప్రమత్తం చేశారు. నెల్లూరు పెద్దాసుపత్రిలో కరోనా బాధితులకు అవసరమైన మందులు, ఆహారం అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. కోవిడ్ కల్లోలంపై తాను సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాసిన లేఖకు స్పందించిన వైద్యఆరోగ్యశాఖ మంత్రికి సోమిరెడ్డి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. నెల్లూరులో 3325 మందికి కోవిడ్ పరీక్షలు చేస్తే 1347 పాజిటివ్ రావడం కరోనా విజృంభణకు నిదర్శనమని, వెంటనే నెల్లూరులో హెల్త్ ఎమర్జన్సీని ప్రకటించి, ప్రమాదకర పరిస్థితుల నుంచి జిల్లాను కాపాడాలని సోమిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# ఆత్మకూరులో లాక్‌డౌన్

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు కోవిడ్ నిబంధనలు తప్పనిసరిగా అమలుచేస్తామని మునిసిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు ఈనెల 20న మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కోవిడ్ కమిటీ సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు.

పది రోజులపాటు మునిసిపల్ పరిధిలోని అన్ని వ్యాపార దుకాణాలను ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల దాకా మాత్రమే నిర్వహించాలన్నారు. టిఫెన్ సెంటర్ల వాళ్ళు పార్శిళ్లు మాత్రమే ఇవ్వాలని, హోటల్ యజమానులు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ వ్యాపారాలు నిర్వహించాలని చెప్పారు. పాలు, మెడికల్ దుకాణాలకు అత్యవసర సేవల కింద అనుమతులు ఉన్నాయని, అయితే అక్కడ కూడా కోవిడ్ నిబంధనలను పాటిస్తూ వ్యాపారాలు నిర్వహించాలన్నారు. మాస్కులు ధరించడం, శానిటైజర్లు ఉప యోగించడం, భౌతికదూరం పాటించడం వంటివన్నీ తప్పనిసరిగా అమలుచేయాలన్నారు. పట్టణ ప్రజలు అత్యవసరమైతే తప్ప బయట తిరగవద్దని సూచించారు.

## కార్పొరేషన్ డీసీ

# పార్థసారథి బదిలీ

నెల్లూరు నగరపాలక సంస్థలో డెప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎల్.పార్థ సారథిని ప్రభుత్వం బదిలీ చేసింది. విజయవాడ జోనల్ కమిషనర్‌గా ఆయన్ను నియమిస్తూ తాజాగా ఈనెల 20న ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులిచ్చారు. సుమారు రెండు నెలల క్రితం కమిషనర్‌కు, పార్థసారథికి మధ్య వచ్చిన వాగ్వాదం ఈ బదిలీకి దారి తీసి నట్లు భావిస్తున్నారు.

## రిజిస్ట్రేషన్ శాఖకు

# అంటుకున్న కోవిడ్

జిల్లాలో విపరీతంగా పెరుగుతున్న రెండోదశ కోవిడ్ తాజాగా రిజిస్ట్రేషన్ శాఖకు కూడా అంటుకుంది. ఎప్పుడూ జనం రద్దీతో ఉండే జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలపై కూడా పంజా విసురు తోంది. తాజాగా ఈ శాఖలో ముగ్గురికి కరోనా సోకడంతో ఈనెల 20న ఆ కార్యా లయాన్ని మూసేశారు. దీంతో రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు స్తంభించిపోయాయి.

## సర్వేపల్లి ఛారిటబుల్ ట్రస్ట్

# సాహిత్య పోటీలు వాయిదా

నెల్లూరులోని సర్వేపల్లి ఛారిటబుల్ ట్రస్ట్ వారిచే ఈ నెల 20వ తేదీన జరగ వలసిన రాష్ట్రస్థాయి సాహిత్య పోటీలను వాయిదా వేసినట్లు ఆ ట్రస్ట్ ఛైర్మన్ సర్వేపల్లి రామమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. కరోనా కారణంగా ఆ పోటీలను జూన్ 25న నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు.

## సాయినాథుని ఆలయంలో

# శ్రీరామనవమి



శ్రీరామనవమి సందర్భంగా ఈ నెల 21న నెల్లూరు బాలాజీనగర్ శివారులో ఉన్న అద్దాల సాయిబాబా మందిరంలోని శ్రీ సాయినాథునికి విశేష పుష్పాలంకరణ చేసి షిరిడి హారతులు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సాయినాథ సంకీర్తన, భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. కరోనా నేపథ్యంలో మాస్కులు ధరించిన భక్తులను మాత్రమే దర్శనానికి అనుమతించారు. భక్తులందరూ సామాజిక దూరాన్ని పాటిస్తూ సాయినాథుని దర్శనం చేసుకున్నారు. కరోనా మహమ్మారి విజృంభిస్తున్న కారణంగా ప్రజల శ్రేయస్సు దృష్ట్యా శ్రీ సాయినాథుని నగరోత్సవం రద్దు చేయడం జరిగింది.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


# నిమ్మ ధరలు కుదేలు..

## • రైతన్నలు దిగాలు



నిమ్మ ధరలు మళ్లీ తగ్గిపోవ డంతో రైతులు దిగాలు పడిపోయారు. ఇటీవల ధరలు బాగున్నాయంటూ సంతోషించిన రైతులకు ఆ ఆనందం ఎన్నో రోజులు మిగల్లేదు. కరోనా దెబ్బకు ధరలు కిందామీదా అవు తుండడంతో మళ్లీ వ్యాపారాలకు నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. కరోనా విజృంభిస్తుండడంతో ఢిల్లీలో లాక్‌డౌన్ ప్రకటించారు. దీంతో అక్కడ నిమ్మకాయలు అమ్ముడుపోక ధరలు తగ్గిపోయాయని నిమ్మరైతులు చెప్తున్నారు. జిల్లాలోని పొదలకూరు, గూడూరు నిమ్మ మార్కెట్లలో నిన్న మొన్నటిదాకా సుమారు 9 వేల రూపాయల దాకా ఉన్న బస్తా నిమ్మకాయల ధర అమాంతం రెండు వేల రూపాయలు తగ్గిపోయి 7వేలకు చేరుకుంది. ఒకమోస్తరు సైజు ఉన్న నిమ్మకాయల బస్తా ధర 5వేల కంటే తక్కువగానే అడుగుతుండడంతో ఇక చేసేది లేక రైతులు అయినకాడికి అమ్ముకుంటున్నారు. అన్ని పరిస్థితులూ అనుకూలించి నిమ్మకాయలకు మంచి ధర వచ్చిందని అనుకుంటున్న పరిస్థితుల్లో కరోనా విజృంభణ రైతులకు ఆశనిపాతమైంది. ఇక మళ్ళీ మంచి ధరలు వచ్చేదెప్పటికి.. తమ జీవితాలు బాగుపడే దెప్పటికి అనుకుంటూ రైతులు నిరాశలో మునిగిపోతున్నారు.

## కరోనా కట్టడికి..

# పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోండి

### - కలెక్టర్‌ను కోరిన కాకాణి



జిల్లాలో కరోనా వ్యాధి నియంత్రణకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధనరెడ్డి ఈనెల 20న జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, జేసీ ప్రభాకర్‌రెడ్డి లను కోరారు. జిల్లాలోని ప్రభుత్వాసుపత్రులతో పాటు ప్రభుత్వం అనుమతించిన ప్రైవేటు ఆసుపత్రుల్లో పడకలు, ఆక్సిజన్, మందులు వగైరాలన్నీ కోవిడ్ బాధితులకు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కరోనా నియంత్రణకు ఎంతో కృషి చేస్తోందని, అందరూ ఆ వ్యాధిని నిరోధించేందుకు సహకరించాలని ఆయన ప్రజలకు సూచించారు.

# రాష్ట్రంలోనూ పరీక్షలు రద్దు చేయండి

### విద్యార్థి జేఏసి నాయకుల డిమాండ్

కరోనా విపరీతమవుతున్న నేపథ్యంలో ఢిల్లీ, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లో విద్యాసంస్థలను మూసివేసి పరీక్షలు రద్దు చేసినట్లుగానే మన రాష్ట్రంలోనూ టెన్త్, ఇంటర్ పరీక్షలను రద్దుచేయాలని ఏపి విద్యార్థి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఆదిత్యసాయి డిమాండ్ చేశారు. ఈనెల 20న ఆయన నెల్లూరులోని సర్వోదయ కళాశాలలో విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటికే విద్యార్థుల్లో కరోనా వ్యాధి వ్యాప్తి ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పరీక్షలను రద్దు చేసి విద్యార్థుల ప్రాణాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శ్రీకాంత్, మధు, అనిల్ పాల్గొన్నారు.

# వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు మూలాపేటలో ఉన్న రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానంలో ఈనెల 22 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. కరోనా కారణంగా ప్రభుత్వ నిబంధనల మేరకు బ్రహ్మోత్సవాలను ఏకాంతంగా నిర్వహి స్తున్నామని, మే రెండో తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయని ఆలయ ఇ.ఓ శ్రీనివాసరావు తెలిపారు.



# నెల్లూరు కబుర్లు

## 'వాత్సల్య'లో వేమిరెడ్డి పుట్టినరోజు వేడుకలు



రాజ్యసభ సభ్యులు, ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పుట్టినరోజైన ఏప్రిల్19న నెల్లూరులోని జనహిత వాత్సల్య బాలల, వృద్ధుల సేవా కేంద్రంలో వేమిరెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. నెల్లూరులోని కార్తీకమాస లక్షదీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆ కమిటీ సభ్యుడు కంజర్ల భాస్కరశర్మ పాల్గొని కేక్ కట్‌చేసి చిన్నారులకు పంచిపెట్టారు. అనంతరం వారందరికీ అన్నం పెట్టారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గంధం సునీల్‌బాబు, ఆశం విజయ సారధి, గట్టుపల్లి పవన్‌కుమార్‌శర్మ, వాత్సల్య ఆశ్రమ నిర్వాహకులు సాంబశివరావు, వాత్సల్య పాఠశాల హెడ్మాస్టర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- మహిళలూ జాగ్రత్త!



## బాబోయ్.. గొలుసు దొంగలు

- ఒకరి మెడలో నగ తెంపుకుని వెళ్ళారు
- మరో మహిళ హ్యాండ్‌బ్యాగ్ లాక్కెళ్ళారు

నెల్లూరులో గొలుసు దొంగలు మళ్లీ విజృంభిస్తున్నారు. ఒంటరిగా నడచివెళ్తున్న మహిళలను వెంబడించి వారి వద్ద ఉన్న నగలు, లేదా బ్యాగ్‌లు లాక్కెళ్తున్నారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదం. కనుక మహిళలు రోడ్ల మీద నడిచి వెళ్ళేటప్పుడు ఎంతో జాగ్రత్తగా ఉండాలి. ఈనెల 19న నగరంలోని నర్తకిసెంటర్‌లోని ఓ షాపులో పనిచేస్తున్న మహిళ ఇంటినుంచి నడుచుకుంటూ వెళ్తుండగా ఏసి సెంటర్ సమీపంలో గుర్తుతెలియని ముగ్గురు దుండగులు బైక్‌పై వేగంగా వచ్చి ఆమె మెడలోని రెండు సవర్ల బంగారుగొలుసును తెంపుకుని పోయారు. బాధితురాలి ఫిర్యాదుతో సంతపేట పోలీసులు రంగంలోకి దిగి దొంగలకోసం వేట ప్రారంభించారు.

**హ్యాండ్‌బ్యాగ్ లాక్కెళ్ళారు :**

నెల్లూరులోని కొండాయపాళెం గేటు వద్ద ఓ మహిళ హ్యాండ్‌బ్యాగ్‌తో వెళ్తుండగా ముగ్గురు యువకులు బైక్‌పై వచ్చి ఆమె చేతిలోని హ్యాండ్ బ్యాగ్‌ను లాక్కెళ్ళారు. ఆమె బ్యాగ్‌ను గట్టిగా పట్టుకున్నా వారు విసురుగా లాగడంతో ఆమె రోడ్డుపై పడి గాయపడింది. బ్యాగ్‌లో మొబైల్‌ఫోన్‌తో పాటు, ఏటిఎం కార్డులు, పాస్‌బుక్, వెయ్యిరూపాయల నగదు ఉన్నాయని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ నాగభూషణం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మహిళలు ఈ గొలుసు దొంగల పట్ల ఎంతో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు చెప్తున్నారు.

## ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలి

**- డ్వామా పి.డి తిరుపతయ్య**

ఉపాధి హామీ పథకం పనుల్లో లక్ష్యం సాధించేందుకు కూలీలసంఖ్య పెంచాలని, లేకుంటే చర్యలు తప్పవని డ్వామా పీడీ తిరుపతయ్య హెచ్చరించారు. సోమవారం నెల్లూరులోని డ్వామా కార్యాలయంనుంచి జూమ్ యాప్ ద్వారా క్లస్టర్ ఏపీడీలు, మండల ఉపాధి హామీ పథకం సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. లక్ష్యసాధనలో కోవూరు, బోగోలు, మనుబోలు తదితర పది మండలాలు వెనుకబడ్డాయని, రోజువారీగా జిల్లాలో 1.50 లక్షల మంది పనులు చేయాలని స్పష్టం చేశారు.



## ప్రజల క్షేమం కోసం 'శోభాయాత్ర'

నెల్లూరులోని శ్రీ వరసిద్ధి విఘ్నేశ్వరస్వామి భక్తులు లోక కళ్యాణం కోసం ఆ భగవంతుని ప్రార్థిస్తూ.. ఈనెల 18న శ్రీ తల్ప గిరి రంగనాథ స్వామి ఆలయం వద్దకు 'శోభాయాత్ర' నిర్వహించారు. మద్రాసుబస్టాండు వద్ద ఉన్న విఘ్నేశ్వరాలయం నుంచి భక్తబృందం రంగనాయకుల పేటలోని రంగనాథస్వామి దేవాలయానికి పాదయాత్రగా వెళ్ళి స్వామివారిని దర్శించుకుని ప్రజలంతా క్షేమంగా ఉండాలని కోరుకున్నారు. జూటూరు శరవణ మహేష్ ఆధ్వర్యంలో మంకాల రామకృష్ణ, ఎస్‌వివిస్ నాగేంద్ర, నారాయణశర్మ, సిహెచ్ హర్షవర్ధన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నవోదయ ప్రవేశ పరీక్ష వాయిదా

జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశానికి వచ్చే నెల 16వ తేదిన నిర్వహించాల్సిన ప్రవేశపరీక్షను ప్రభుత్వం వాయిదా వేసిందని డి ఇ ఓ రమేష్ తెలిపారు. పరిపాలన కారణాలతో పరీక్షను వాయిదా వేశారని, ఆ పరీక్ష ఎప్పుడు నిర్వహించేదీ తర్వాత తెలియజేస్తామని ఆయన ఇటీవల ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## పవన్‌కల్యాణ్ కోలుకోవాలి

జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని కోరుకుంటూ ఈనెల 18న నెల్లూరులోని బారాషహీద్ దర్గా ప్రాంగణంలో జనసేన జిల్లా మైనార్టీ నాయకులు షానవాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేకప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో టోనీ బాబు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సిబ్బందికి ప్రత్యేక వార్డు

జిల్లాలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బందికి ప్రత్యేక వార్డులు కేటాయించాలని హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అధ్యక్షుడు చేజర్ల సుధాకరరావు ప్రభుత్వాన్ని కోరారు. నెల్లూరులోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది కరోనా సందర్భంలో ఏర్పాటు చేసినట్లుగా ఇప్పుడు కూడా ప్రత్యేకవార్డులు ఏర్పాటుచేసి చికిత్సలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

## కేంద్ర సినిమా సెన్సార్ బోర్డు సభ్యురాలిగా డా. విజయలక్ష్మి



బిజెపిలో సామాన్య కార్యకర్తగా ఉంటూ, విశ్వహిందూ పరిషత్‌లోను, ఆ తర్వాత బిజెపి మహిళా మోర్చాలోనూ పనిచేసిన డాక్టర్ మారం విజయలక్ష్మికి కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు అడ్వయిజరీ కమిటీ సభ్యురాలిగా పదవి లభించింది. ఆమెను ఆ పదవిలో నియమిస్తూ ఈనెల 18న హైదరాబాద్ లోని సెంట్రల్ ఫిలిమ్ సెన్సార్ బోర్డు నుంచి ఉత్తర్వులు వచ్చాయి. నెల్లూరుకు చెందిన డా. విజయలక్ష్మి ప్రముఖ గైనకాలజిస్టుగా, బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యురాలిగా అటు వృత్తిపరంగానూ, ఇటు పార్టీ పరంగానూ ప్రజలకు విశేషసేవ లందిస్తున్నారు. గతంలో కోవూరు నియోజకవర్గం నుంచి బిజెపి తరపున ఆమె పోటీచేశారు కూడా. తనకు కేంద్ర ఫిలిమ్ సెన్సార్ బోర్డు సభ్యురాలి పదవి వచ్చేందుకు సహకరించిన బిజెపి నాయకులకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

## రంజాన్ తోఫా ఇవ్వాలి

నిరుపేద ముస్లిం మైనార్టీలకు రంజాన్ తోఫా ఇవ్వాలని ఆవాజ్ కమిటీ నాయకులు ఈనెల 19న నెల్లూరు నగరంలోని 53,54 డివిజన్ల వార్డు సచివాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. మసీదుల్లో పనిచేస్తున్న ఇమామ్, మౌజన్లకు పెంచిన జీతాలు అందజేయాలని వారు కోరారు. ఆవాజ్ కమిటీ నాయకులు ఎస్‌కె సలాం, రెహమాన్, కలాం తదితరులు పాల్గొన్నారు.

## సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడు రవిరాజ్ మృతి

ప్రముఖ సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడు, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి చమర్తి రవిరాజ్ (47) ఈనెల 18న అనారోగ్యంతో కన్నుమూశారు. సాఫ్ట్‌బాల్ క్రీడాకారునిగానే కాకుండా జిల్లాలో సాఫ్ట్‌బాల్ క్రీడ అభివృద్ధికి ఆయనెంతగానో కృషిచేశారని, ఆయన మృతి క్రీడారంగానికి తీరని లోటని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ పేర్కొంటూ రవిరాజ్ మృతికి విచారం వ్యక్తం చేశారు. ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మలిరెడ్డి కోటారెడ్డి, అరిగెల విజయకుమార్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి పి.థామస్, ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి కె.గురుప్రసాద్, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యాదర్శి వాసు తదితరులు రవిరాజ్ మృతికి విచారం వ్యక్తం చేస్తూ సంతాపం ప్రకటించారు.



## రెండోదశ కోవిడ్‌ను అరికట్టాలి

**- అధికారులతో కలెక్టర్**

అత్యంత వేగంగా వ్యాపిస్తున్న కోవిడ్ వైరస్ రెండోదశను సత్వరం అరికట్టేందుకు జిల్లాలోని అన్ని శాఖలవారు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఆర్డీఓలు, మండల ప్రత్యేకాధికారులు, మునిసిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, వైద్యాధికారులను ఆదేశించారు. ఈనెల 20వ తేదిన నెల్లూరులోని కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమై కోవిడ్ ఉధృతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కోవిడ్ వ్యాక్సినేషన్ అమలుపై చర్చించారు. గత ఏడాది కోవిడ్‌ను జిల్లా యంత్రాంగం సమర్థంగా ఎదుర్కొందని, అదేస్ఫూర్తితో రెండోదశ కోవిడ్‌ను కూడా అరికట్టాలని, అందుకు పటిష్టమైన ప్రణాళికలతో చర్యలు చేపట్టాలని చెప్పారు. జిల్లాలోని కోవిడ్‌సెంటర్లు, ఆసుపత్రుల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాటుచేయాలని, కోవిడ్ ఆసుపత్రుల్లో ఆక్సిజన్, అదనపు బెడ్స్ ఏర్పాటుకు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతి సచివాలయాన్ని యూనిట్‌గా తీసుకుని కమిటీలను ఏర్పాటుచేసి కోవిడ్ నియంత్రణకు అందరూ కృషిచేయాలన్నారు. కోవిడ్ నియంత్రణకు కలెక్టరేట్‌లో 104, 1077 కాల్ సెంటర్లను ఏర్పాటుచేశామని, బాధితులు ఫోన్ చేస్తే వెంటనే స్పందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలోని ఫ్రంట్‌లైన్ వర్కర్లందరికి నూరుశాతం వ్యాక్సినేషన్ పూర్తిచేయాలన్నారు. ఇప్పటిదాకా జిల్లాలో 3.56 లక్షల మందికి వ్యాక్సిన్ ఇవ్వడం జరిగిందని, మే 1 నుంచి 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుందని, అధికారులు అందుకనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. కోవిడ్ నిబంధనలపై అందరికీ అవగాహన కల్పించాలని, మాస్కు ధరించనివారికి పోలీసులు జరిమానా విధించాలని, స్విమ్మింగ్ పూల్స్ మూసివేయాలని ఆదేశించారు. జేసీలు డా.ప్రభాకర్‌రెడ్డి, డా.హరేంధిరప్రసాద్, అడిషనల్ ఎస్పీ శ్రీమతి వెంకటరత్నం, డిఎఫ్ఓ షణ్ముఖకుమార్, డిఆర్ఓ చినఓబులేసు పాల్గొన్నారు.

## కోవిడ్‌పై ప్రజలను అప్రమత్తం చేయాలి

నెల్లూరు నగరంలో ఉధృతమవుతున్న కోవిడ్ వైరస్‌పై ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత ఎంపీడీఓలు, ఇఓఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులపై ఉందని నెల్లూరు డివిజన్ పంచాయతీ అధికారి కృష్ణమోహన్ చెప్పారు. నగరంలోని నెల్లూరు గ్రామీణ మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 19న ఆయన కోవిడ్‌పై అధికారులకు శిక్షణ సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ కోవిడ్ టీకా వేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు డివిజన్ పరిధిలోని ఎంపీడీఓలు, ఇఓఆర్డీలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## 'వాత్సల్య' చిన్నారులకు పుస్తకాలు

నెల్లూరు, జనహిత 'వాత్సల్య'లోని హైస్కూలు విద్యార్థులకు ఈనెల 18న జాన్సన్ అండ్ జాన్సన్ కంపెనీ ఏడిఎం ఆర్.రాజశేఖర్ పుస్తకాలను వితరణగా అందించారు. చేజర్ల సుధాకర్‌రావు, సాంబశివరావు, హెడ్మాస్టర్ మధుసూదన్‌రెడ్డి, రాజేష్, మల్లికార్జున, గిరి పాల్గొన్నారు.

## వైద్యశాఖ అధికారిణినీ వదిలిపెట్టని కరోనా

కరోనా మహమ్మారి వ్యాధిపై అనునిత్యం పోరాడుతున్న వైద్య శాఖ వర్గాలను కూడా కరోనా వదిలిపెట్టడం లేదు. తాజాగా ఇటీవల జిల్లా వైద్యశాఖ అధికారిణి డాక్టర్ రాజ్యలక్ష్మికి కరోనా పాజిటివ్ రావడంతో ఆమె రెండు వారాలు సెలవుపెట్టి హోం క్వారంటైన్‌లో చికిత్స చేయించుకుంటున్నట్లు సమాచారం. దీంతో ఆమెతో పాటు అనేక సమావేశాలకు హాజరైన ఉద్యోగులు, సిబ్బంది అందరిలోనూ కరోనా కలవరం రేకెత్తిస్తోంది. వీరంతా కరోనా నిర్ధారణ పరీక్షలు చేయించుకునేందుకు సిద్ధమవుతున్నారు.

## అగ్నిప్రమాదాలతో జాగ్రత్త

ఈ వేసవికాలంలో అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా ఇటీవల ఆయన వేదాయపాళెంలోని లిల్లీ లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో అగ్నిమాపక శాఖ, రాష్ట్ర విపత్తు స్పందన శాఖల ఆధ్వర్యంలో అవగాహన తరగతులు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు ఎలా జరుగుతాయి, వాటిని ఎలా నివారించుకోవాలనే అంశాలను వివరించారు. అగ్నిమాపకశాఖ అధికారులు శంకర్ ప్రసాద్, శ్రీనివాసులురెడ్డి, పాఠశాల కరెస్పాండెంట్ కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

## కోవిడ్ ఆసుపత్రుల్లో ..

# ఆక్సిజన్ సిద్ధంగా ఉంచండి

**- మంత్రి అనిల్ ఆదేశం**



జిల్లాలో ప్రభుత్వం అనుమతించిన కోవిడ్ హాస్పిటల్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, వాటిలో బాధితులకు అవసరమైన ఆక్సిజన్ సిద్ధంగా ఉండేలా చూడాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ కలెక్టర్ చక్రధర్ బాబును ఆదేశించారు.

జిల్లాలో మూడు రోజులుగా కోవిడ్ కేసులు బాగా పెరుగుతున్నాయని, ఈనెల 20వ తేదీ ఒక్కరోజే 1,347 కేసులు నమోదయ్యాయని, పాజిటివ్ వచ్చిన వారికి పూర్తిస్థాయిలో సౌకర్యాలతో హాస్పిటళ్లలో పడకలు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ఈనెల 20న మంత్రి అనిల్ విజయవాడ నుంచి కలెక్టర్‌తో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రధానంగా హాస్పిటళ్లలో అదనపు బెడ్లు ఏర్పాటు చేయడంతోపాటు జీజీహెచ్‌తో పాటు అన్ని హాస్పిటళ్లలో ఆక్సిజన్ అందుబాటులో ఉండాలని, ఇతర మౌళిక సదుపాయాలు కల్పించేలా ఎప్పటికప్పుడు జేసీ ద్వారా పరిస్థితులను పర్యవేక్షించాలని చెప్పారు. కోవిడ్ రెండోదశ వ్యాప్తి వేగంగా విస్తరిస్తున్న నేపధ్యంలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలతో ముందస్తు చర్యలు తీసుకుని కోవిడ్ కట్టడికి కృషి చేయాలన్నారు. ప్రధానంగా పట్టణాలు, నగరాల్లో కోవిడ్ వ్యాప్తి ఎక్కువగా ఉందని, మునిసిపాలిటీలు, నెల్లూరు నగరంలోనూ శానిటేషన్ పక్కాగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కోవిడ్ బాధితునికి ఆస్పత్రిలో వైద్యం అందేలా చూడాలన్నారు. జిల్లాలో నోటిపై చేసిన 21 కోవిడ్ హాస్పిటల్స్‌లో పరిస్థితిని ప్రతి రోజూ సమీక్షించాలన్నారు. అనుమతించిన అన్ని హాస్పిటల్స్‌లో రెమిడెసివిర్ ఇంజక్షన్ కొరత లేకుండా చూడాలని మంత్రి సూచించారు.

# సున్నా వడ్డీ నగదు వచ్చేసింది

**● రైతుల్లో ఆనందం**

రైతులను ఆదుకునేందుకు కర్షకుడి కష్టంలో సాయంగా ఉండాలని భావించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సున్నా వడ్డీ పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకంలో భాగంగా గత 2019 రబీ సీజన్‌లో తాము తీసుకున్న రుణాలను సకాలంలో కట్టిన రైతుల ఖాతాల్లోకి ఇప్పుడు రూ.3.67 కోట్ల పంపిణీ చేసి రైతన్నలకు అండగా తామున్నామంటూ నిరూపించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ సున్నావడ్డీ పథకం ద్వారా జిల్లాలో 23,980 మందికి ప్రయోజనం కలిగిస్తూ ఈనెల 20న తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం ఈ పథకాన్ని ప్రారంభించారు. జిల్లాలోని ఆత్మకూరు నియోజకవర్గంలో 3,058 మందికి, గూడూరులో 3,337, కావలిలో 1,184 కోవూరులో 1,417, నెల్లూరులో 580, సర్వేపల్లిలో 2,570, సూళ్లూరుపేటలో 3,549, ఉదయగిరిలో 4,171, వెంకటగిరిలో 4,134 మందికి మొత్తం 23,980 మంది రైతుల ఖాతాల్లో నగదు జమ కావడంతో అన్నదాతలు సంతోషిస్తున్నారు.

# పల్లిపాడులో శ్రీరామనవమి వేడుకలు



ఇందుకూరుపేట మండలం, పల్లిపాడు గ్రామంలో కొలువైన శ్రీ రామేశ్వర వేణు గోపాలస్వామి ఆలయంలో ఈనెల 20న శ్రీరామనవమి వేడుకలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజు కలశస్థాపన, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలు వేడుకగా చేశారు. ఈనెల 21న శ్రీరామనవమి సందర్భంగా స్వామివారికి కల్యాణోత్సవం, గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

# ఎయిడెడ్ విద్యాసంస్థలను ఆదుకోవాలి

**- ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం**



రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఎయిడెడ్ కళాశాలలను మూసివేయాలని నిర్ణయించుకుని జిఓ 52ను విడుదల చేయడం సముచితం కాదని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఈనెల 20న నెల్లూరులోని విఆర్ కాలేజీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎయిడెడ్ కళాశాలలను కాపాడుకోవాలన్నారు. కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గి పోయిందనే సాకుతో ప్రభుత్వం పలు కళాశాలల్లోని అధ్యాపకులను, ఉద్యోగులను ప్రభుత్వ కళాశాలలకు బదిలీ చేసి ఆ కళాశాలల్ని యాజమాన్యాలకు అప్పగించేలా ప్రయత్నిస్తుండడం విచారకరమన్నారు. దాదాపు రెండు దశాబ్దాలుగా ఎయిడెడ్ కళాశాలల్లోని పోస్టులను భర్తీ చేయకుండా నిషేధించి పథకం ప్రకారం వాటిని నిర్వీర్యం చేశారని ఆయన విమర్శించారు. దీంతో నెల్లూరులో వీఆర్సీ, సర్వోదయ, వేణు గోపాలస్వామి కాలేజీలు, కావలిలోని జవహర్ భారతి విద్యాలయాలు అస్తిత్వం కోల్పోతాయన్నారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన ఎయిడెడ్ విద్యా సంస్థలను మూసివేసి వ్యాపార సంస్థలుగా మార్చే ఆలోచనను విరమించుకోవాలన్నారు. ఎయిడెడ్ కళాశాలల్లో పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వీఆర్ కళాశాల ప్రిన్సిపల్ వీవీ కృష్ణశర్మతో పాటు జవహర్‌భారతి కళాశాల, వేణుగోపాలస్వామి కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్ళు

# సక్రమంగా ఉండాలి

**- జేసీ హరేందిరప్రసాద్**

జిల్లాలో ధాన్యం కొనుగోళ్ళ ప్రక్రియ పక్కాగా ఉండాలని, రైతులకు ఇబ్బంది లేకుండా వారు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనల మేరకు కొనుగోళ్ళు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ హరేందిరప్రసాద్ చెప్పారు. ఈనెల 19న ఆయన నెల్లూరు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాలులో పౌరసరఫరాల సంస్థ అధికారులు, రైస్‌మిల్లర్ల సంఘం ప్రతినిధులతో సమావేశమై ధాన్యం కొనుగోళ్ళ విషయం చర్చించారు. ధాన్యం కొనుగోళ్ల కోసం కొనుగోళ్ల కేంద్రాలు ఏర్పాటు చేశామని, వీటిద్వారా రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా చూడాలన్నారు. రైతులకు అవసరమైన గోతాలు పంపిణీ చేయాలని కూడా ఆయన వారికి సూచించారు.

## బంగారంగళ్ళను

# ఆరు గంటలకే మూసేస్తాం


కరోనా వ్యాప్తి అధికంగా ఉన్న నేపథ్యంలో నెల్లూరు నగరంలోని బంగారు దుకాణాలను ఈనెల 30వ తేది దాకా ప్రతిరోజు సాయంత్రం 6 గంటల లోపే మూసివేయాలని నిర్ణయించామని రాష్ట్ర బులియన్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు కె.విజయకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోవిడ్ వైరస్‌ను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా బంగారు దుకాణాల యజమానుల కోరిక మేరకు ఈ విషయాన్ని కమిటీలో చర్చించి నిర్ణయించడం జరిగిందని తెలిపారు.

## అయిదుగురు

# విద్యార్థులకు కరోనా

వరికుంటపాడు మండలంలోని పెద్దిరెడ్డిపల్లి ఉన్నతపాఠశాలలో అయిదుగురు విద్యార్థులకు కరోనా సోకినట్లు తాజాగా నిర్ధారణ అయింది. ఆ పాఠశాల ఉపాధ్యాయుడు ఇటీవలే కరోనాతో మరణించడంతో విద్యార్థులందరికి కోవిడ్ పరీక్షలు నిర్వహించగా అయిదుగురు విద్యార్థులు ఈ వ్యాధికి గురైనట్లు తేలిందని సంబంధిత వైద్యాధికారులు పేర్కొన్నారు.


# సంస్మరణ



కీ॥శే॥ బోగొల్లు నారాయణరెడ్డి గారు

నిర్యాణం: 23-4-1995 వర్ధంతి: 23-4-2021

మా తండ్రి

బోగొల్లు నారాయణరెడ్డి గారి

26 వ వర్ధంతి సందర్భంగా

వారి పవిత్ర ఆత్మకు

శాంతి చేకూరాలని ఆశిస్తూ...

బి.మోహన్‌రెడ్డి

Architect & Engineer

Mohan Architects (P) Ltd.,

Chennai

ఫోన్: 044-24510157

మరియు

కుటుంబసభ్యులు

# తొందరపడి ఆ కోయిలమ్మ... ముందే కూసింది!



రాష్ట్రంలో 'షర్మిల' పేరు కలిగిన ఆడపిల్లలు... మహిళలు ఎంతమంది అయినా ఉండి ఉండవచ్చును గానీ మనకు (అంటే జనానికి) ముందుగా గుర్తుకు వచ్చేది మాత్రం మన వైస్సార్ గారి అమ్మాయే.

ఆంధ్రలో వైసీపీ అత్యంత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న రాజకీయ పరిస్థితులలో.. తన అన్న జగన్ జైలుకే పరిమితమైపోయి ఉన్న తరుణంలో ఆంధ్రదేశంలో ఆ మూలనుంచి ఈ మూల వరకు మూడువేల కిలోమీటర్ల పైబడి పాదయాత్ర చేసిన వీర మహిళగా ఆమె దేశం దృష్టిని విశేషంగా ఆకర్షించారు. ఈ దేశంలో రాజకీయ పాదయాత్ర చేసిన తొలి మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. అప్పటివరకు ఇంతటి సుదీర్ఘ పాదయాత్ర తెలంగాణలోని చేవెళ్ల నుంచి శ్రీకాకుళంలోని ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర చేసింది వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఒక్కరే.

ఒక పురుషుడు పాదయాత్ర చేయడం వేరు. పురుషుని శరీర నిర్మాణం, దేహ ధారుఢ్యం సుదీర్ఘ పాదయాత్రకు పెద్దగా ఇబ్బంది లేకుండా ఉంటాయి. నడక సందర్భంగా పాదాల శ్రమ తగ్గించడానికి యువకులు వెన్నంటి ఉంటారు. మసాజ్ లాంటి ప్రక్రియలు ఉంటాయి.

కానీ, ఒక మహిళ శరీర నిర్మాణం తీరు వేరు. సమస్యలు వేరు. కేవలం సంకల్ప బలం, పట్టుదల, దృఢచిత్తం వల్ల అయినా కూడా ఎండలలో... వానలలో... చలిలో... తినీ, తినకా మూడువేల కిలోమీటర్ల పాదయాత్ర చేయడం వై.ఎస్ కుమార్తె షర్మిలకే చెల్లింది.



అంతటి స్థిర చిత్తం, పట్టుదల, రాజకీయ సంకల్పం కలిగిన షర్మిల... తెలంగాణతో మమేకం కావాలని డిసైడ్ అవ్వడం మాత్రం రాజకీయవర్గాలకు ఆశ్చర్యం కలిగించింది. ఆవిడ వైయస్సార్ పుత్రికగానూ... 'జగనన్న వదిలిన బాణం'గానే ప్రజలకు తెలుసు. అందువల్లనే, తెలంగాణలో తన రాజకీయ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని నిర్ణయించుకున్నారనే విషయం స్పష్టమైనప్పుడు ఉభయ రాష్ట్రాల్లోనూ పెద్ద ఎత్తున విస్మయం వ్యక్తమైంది.




ఈ విస్మయానికి ఆవిడే వివరణ కూడా ఇచ్చారు. తాను తెలంగాణ(హైదరాబాద్)లోనే పుట్టి పెరిగానని, ఇక్కడే చదువు సంధ్యలు నేర్చుకున్నానని, తాను మెట్టినిల్లు కూడా తెలంగాణే అని చెప్పారు. చావో...రేవో తాను తెలంగాణతోనే ఉంటానని కూడా షర్మిల తెగేసి చెప్పారు. పులివెందుల కంటే ఖమ్మం జిల్లాలోని పాలేర్ నియోజకవర్గమే తనకు ముఖ్యమని కూడా షర్మిల చెప్పారు.

నిజానికి, ఆవిడ నిర్ణయాన్ని ఎవరూ కాదనలేరు. ఆవిడ ఈ దేశ పౌరురాలు. ఎక్కడైనా స్వేచ్ఛగా జీవించే హక్కు, తనకు నచ్చిన రాజకీయాల్లో పాల్గొనే హక్కు ఆవిడకు ఉంది. అలాగే, ఆమె తనకు నచ్చిన ప్రజల కోసం ఉద్యమించే హక్కు కూడా ఎవరూ కాదనలేనిది. ఆమె రాజకీయ ప్రకటనతో తెలంగాణలోని వైయస్సార్ అభిమానులు పెద్ద ఎత్తున మద్దతు ప్రకటించారు. తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల నుంచి కూడా పెద్దఎత్తున హైద్రాబాద్‌కు తరలిరావడం ప్రారంభించారు. షర్మిలకు నలుగురితో భద్రత కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించడం అంటే ఆమె ఉనికిని ప్రాథమికంగా గుర్తించడమే.

తెలంగాణలోని నిరుద్యోగులకు బాసటగా హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద మొదలుపెట్టిన దీక్షను లోటస్‌పాండ్ నివాసం వద్ద కొనసాగించే క్రమంలో తొట్రుపడిన సందర్భాన్ని మినహాయిస్తే ఆమె చాలా నిగ్రహంతో, సంయమనంతో, పరిణతితో అడుగులు వేసుకుంటూ వస్తున్నారు. ఏ జిల్లా అభిమానులు వస్తే ఆ జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమే ముందుగా ప్రస్తావిస్తూ, అభిమానులను ఆశ్చర్యంలో ముంచెత్తుతూ వచ్చారు. తెలంగాణపై సంపూర్ణ అవగాహన కలిగిన "భావి నేత" అన్న అభిప్రాయం షర్మిల తనను చూడవచ్చే వై.ఎస్ అభిమానులకు కలిగించారు.

ఖమ్మం సభ వరకు ఆమె అడుగులు సరిగ్గానే పడ్డాయి అనే అభిప్రాయం... ఆమెను పరిశీలించేవారిలో కలిగింది. రాజశేఖర రెడ్డిని తలపించే బాడీ లాంగ్వేజ్, చెరగని చిరునవ్వు, హావ భావాలు, ప్రసంగం తీరు సభికులను మంత్రముగ్ధులను చేశాయి.

ఏ పార్టీని లక్ష్యంగా చేసుకుని రాజకీయ విమర్శలు చేయాలో... అలా చేశారు. ఒక ప్రతిపక్ష పార్టీగా అధికార పక్షాన్ని గాక మరో ప్రతిపక్ష పార్టీని విమర్శించి ఉంటే ఆమె 'షర్మిల' అయ్యేవారు కాదు. 'లేడీ పవన్ కళ్యాణ్' అయ్యేవారు.

ఆంధ్ర ఎన్నికల్లో అధికారపక్షమైన తెలుగుదేశం ను కాకుండా తోటి ప్రతిపక్షమైన వైసీపీని, జగన్‌ను పవన్ కళ్యాణ్ విమర్శిస్తూ తిరగడం వల్లే జనసేనకు ఒక్క సీట్ మాత్రమే కట్టబెట్టారు.

ఇక, నిరుద్యోగులకు మద్దతుగా 3 రోజులపాటు దీక్ష చేస్తాను అంటూ ఖమ్మం సభలో చేసిన ప్రకటనకు అనుగుణంగా ఇందిరా పార్కు వద్ద ఆమె 3 రోజుల దీక్షను చేపట్టాలని భావించారు.

అయితే, ఆమె భద్రత, కోవిడ్ విజృంభణ మొదలైన అనేక కారణాల వల్ల కావచ్చు... ఒక్కరోజు దీక్షకు మాత్రమే పోలీసులు అనుమతించారు. అయితే, దీక్ష అనంతరం ఆమె లోటస్‌పాండ్ నివాసానికి కాలి నడకన వెళ్లాలని భావించడంతో పోలీసులతో కొంత ఘర్షణ వాతావరణం చోటుచేసుకున్నది. ఆ సందర్భంగా ఆమె దుస్తులు కొద్దిగా చిరిగి... చేతికి చిన్న గాయమయింది.

దీంతో, లోటస్ పాండ్ వద్దే ఆమె తన దీక్షను కొనసాగించాలని నిర్ణయించారు. ఆ దీక్షా సందర్భంలో మాట్లాడే సమయంలో... ఆమె కొంత సంయమనం కోల్పోయి, తొట్రుపాటుకు గురయ్యారా అనే భావన కలిగింది.

"ఎప్పుడో ఒకప్పుడు నేను తెలంగాణకు ముఖ్యమంత్రిని అవుతా" అంటూ షర్మిల వ్యాఖ్యానించడంతో, ఆ ఈవెంట్‌ను కవర్‌చేసే విలేకరులు కూడా విస్మయానికి గురయ్యారు.

ఎందుకంటే.. అటువంటి రాజకీయ ఆకాంక్షను వ్యక్తం చేయడానికి అది సమయమూ కాదు, సందర్భమూ కాదు. నిజానికి, అటువంటి లక్ష్యం కలిగి ఉండడంలో తప్పులేదు. పదవుల సాధనే లక్ష్యంగా రాజకీయ నాయకులు రాజకీయాల్లోకి వస్తారు. కొందరు తమ లక్ష్యాన్ని చేరుకుంటారు. కొందరు చేరుకోలేరు. అందువల్ల, తెలంగాణకు ముఖ్యమంత్రి కావాలనే లక్ష్యంతో జనజీవితంలోకి ఆవిడ రావాలనుకోవడంలో తప్పు పట్టవలసింది ఏమీలేదు.

కానీ, లక్ష్యం సుదూరంగా ఉంది. పార్టీ పేరునే ఆమె ప్రకటించలేదు. ఇందుకు ఇంకో రెండు నెలల సమయం పెట్టుకున్నారు. పార్టీకి ఎజెండా, జెండా, రాజ్యాంగం ఇంకా ఏర్పాటు కావలసి ఉంది. పార్టీ నిర్మాణం కావలిసి ఉంది. ఈ దశలు అన్నీ దాటిన తరువాత, తన పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా షర్మిల పేరు ప్రకటితమైతే, ఎవరికీ అభ్యంతరం ఉండదు. అవేమీ లేకుండా, తనకు తాను.. తన రాజకీయ ఆకాంక్షను హఠాత్తుగా ప్రకటించడంతో ఇక ఆవిడ ఏ పని చేసినా... ఏ కార్యక్రమం చేపట్టినా... "ఆ చూపుతోనే.." అనే వ్యతిరేక వ్యాఖ్యానాలు, ప్రకటనలనూ ఆమె ముందు ముందు రుచి చూడాల్సి ఉంటుంది. ఈ పరిణామం షర్మిల రాజకీయ ఎదుగుదలకు సహకరించదు. చెట్టు మీద కాయను చెట్టు మీదే పక్వానికి రానివ్వాలి. అప్పుడు ఆ రుచి వేరుగా ఉంటుంది. అప్పటిదాకా ఆగలేక, కోసి... ఏదో రసాయనం వేసి, మగ్గిపెట్టి... ముగ్గబెడితే... పైన తోలు ముగ్గుతుంది గానీ, లోపల పండు తెల్లగానే ఉంటుంది. పులుపు కూడా పోదు. అలాగే ఉంటుంది.

అసెంబ్లీ ఎన్నికలు ఇంకా రెండున్నర మూడేళ్లు ఉండగానే.... పార్టీ పేరు ప్రకటించడానికి ఇంకా రెండు మూడు నెలల సమయం ఉండగానే... పార్టీ నిర్మాణం లేకుండానే... పెట్టదలచిన పార్టీ రంగు, రుచి, వాసన ఏమిటో తెలంగాణ వాసులకు తెలియకుండానే ఆవిడ చేసిన ప్రకటన తొందరపాటు చర్యగానే రాజకీయ మేధావులు కూడా భావిస్తున్నారు. తెలంగాణ ప్రజల కోసం చేద్దామనుకునే ఆమె పోరాటంలోని చిత్తశుద్ధిని ప్రజలు శంకించేటట్టు ఈ ప్రకటన చేస్తుంది. అయితే... ముఖ్యమంత్రి కాగల సత్తా తనకూ ఉన్నదనే సందేశాన్ని పంపడానికి ఆ మాట జారారా లేక అందరి దృష్టీ తనవైపు తిప్పుకోవాలనే వ్యూహంలో భాగంగా చేశారో తెలియదు మరి. కానీ, ఇంకా టైటిల్స్ కూడా వేయకుండానే కథను ఏకాయెకిన క్లైమాక్స్ లోకి తీసుకెళ్లిన అనుభూతిని మాత్రం షర్మిల కలిగించారు.

ఆమె తెలంగాణ రాజకీయాలలో తనకంటూ ఒక అధ్యాయాన్ని లిఖించాలి అని భావిస్తూ ఉంటే మాత్రం... అణ్వాయుధం లాటి 'మాట' మీద పూర్తి నియంత్రణ, సంయమనం, నిగ్రహం పాటించాలి. సందర్భశుద్ధి లేని భావవ్యక్తీకరణ ఆమె స్థాయిని పలుచన చేస్తుంది.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com




## గూడూరులో లాక్‌డౌన్ లేదు

**సబ్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ**



గూడూరులో ఎటువంటి లాక్‌డౌన్ లేదని, వ్యాపారులు స్వచ్ఛందంగా తమ దుకాణాలను మూసివేయవచ్చు తప్ప.. అధికారిక లాక్‌డౌన్ లేదని గూడూరు సబ్‌కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ తెలిపారు. ప్రజలు కోవిడ్ నిబంధనలు తప్పక పాటించాలని, మాస్క్ ధరించని వారికి వందరూపాయలు జరిమానా విధిస్తామని, కరోనా సెకండ్‌వేవ్ నియంత్రణకు అన్ని విధాలా తగిన చర్యలు తీసుకుంటున్నామని, కోవిడ్ కేర్ సెంటర్లలో 5వేల గదుల వరకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఒకటో తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు అన్ని పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిందని, కోవిడ్ నిబంధనలతో పదవ తరగతి, ఇంటర్మీడియట్ తరగతులు జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు.

## మధ్యాహ్నం వరకే దుకాణాలు

**మున్సిపల్ కమిషనర్ ఓబులేసు**



కరోనా ఉధృతి పెరగడంతో గూడూరు పట్టణంలో మధ్యాహ్నం రెండు గంటల వరకు మాత్రమే దుకాణాలు నిర్వహించేందుకు అనుమతి ఇచ్చామని గూడూరు మునిసిపల్ కమిషనర్ ఓబులేసు పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోవిడ్ కేసులు ఇటీవల కాలంలో ఎక్కువయ్యాయని, కరోనాను కట్టడి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 20వ తేదీ నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు మాత్రమే దుకాణాలు ఉంటాయని, ఔషధ దుకాణాలు, పాల డైరీలు మాత్రమే సాయంత్రం వరకు ఉంటాయన్నారు. ప్రజలు గుర్తించి సహకరించాలన్నారు. కోవిడ్ నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలని ఆయన పేర్కొన్నారు.

## కటాలమ్మా.. కటాక్షించమ్మా!



గూడూరు పురపాలక సంఘంలోని చెన్నూరులో వెలసిన కటాలమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అర్చకులు నాగార్జున ఆధ్వర్యాన అమ్మవారికి అభిషేకం, అర్చన, అష్టోత్తరం తదితర పూజలు చేపట్టి పట్టువస్త్రాలు, ఆభరణాలు, పుష్పాలతో అలంక రించారు. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

## పోలీసుల చలి వేంద్రం



ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని నెల్లూరు జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ ఆదేశాల మేరకు, గూడూరు రూరల్ సర్కిల్ ఇనస్పెక్టర్ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో, చిల్లకూరు పోలీస్‌స్టేషన్ ఎస్ఐ బాబీ సహాయ సహకారాలతో చిల్లకూరు పోలీస్ స్టేషన్ ముందు ఇటీవల మజ్జిగ, మంచినీటి చలివేంద్రం ఏర్పాటు చేశారు. మాజీ విలేకరి గోపినాథ్ జయంతి సందర్భంగా వారి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఈ చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. సబ్‌ఇన్స్‌పెక్టర్ బాబీ, నాగూరయ్య, విష్ణు, పోలీస్ సిబ్బంది, గోపినాథ్ కుటుంబసభ్యులు, బాబు మోహన్‌దాస్, రసూల్ పాల్గొన్నారు

## అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ



అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాలను నివారించగలమని అగ్నిమాప శాఖాధికారి సుధాకర్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గూడూరు పట్టణంలోని పెట్రోలు బంకులు, హాస్పిటల్స్, నెల్‌క్యాస్ట్ పరిశ్రమలలో ఈనెల 18వతేదీ అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు ఎల్లవేళలా జాగ్రత్తగా ఉండాలని, అగ్ని ప్రమాదం సంభవిస్తే తక్షణం స్పందించాలని, ఆలస్యం చేసేకొద్దీ ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లే అవకాశముందన్నారు.

# ఈత సరదా.. ఇద్దరు చిన్నారుల ప్రాణాలు తీసింది

విందూరు గిరిజన కాలనీలో విషాదం

ఈత సరదా ఇద్దరు చిన్నారుల ప్రాణాలను బలితీసుకుంది. అభం శుభం తెలియని ఆ చిన్నారులు సరదాగా చెరువు దగ్గరకు వెళ్ళి నీళ్ళలో దిగారు. అక్కడ లోతుగా ఉండడంతో ప్రమాద వశాత్తూ మునిగిపోయి మృతిచెందారు. దీంతో వారి తల్లిదండ్రులు గోడుగోడుమంటున్నారు. ఈనెల 19న ఈ దుర్ఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గూడూరు మండలంలోని విందూరు గిరి జన కాలనీకి చెందిన కోటయ్య-శైలజల చిన్నకొడుకు మల్లికార్జున (5), చిన్న అంకయ్య-అరుణల పెద్దకొడుకు శ్రీహరి (6), మరో నాలుగేళ్ళ బాలుడు కిరణ్ ముగ్గురూ ఆడుకోవడానికని కాలనీకి అరకిలోమీటర్ దూరంలో ఉన్న చెరువు దగ్గరకు వెళ్ళారు. నీళ్ళని చూసి సరదాగా మల్లికార్జున, శ్రీహరి నీళ్ళలోకిదిగి నడుచుకుంటూ వెళ్ళారు. నాలుగడుగులు వేశారో లేదో అక్కడ లోతు పెరగడంతో నీళ్ళలో మునిగిపోయారు. అదిచూసి గట్టుమీదున్న కిరణ్ పెద్దగా ఏడుస్తుండడంతో స్థానికులు గమనించి చెరువులోకి దిగి మునిగి



పోయిన చిన్నారులకోసం గాలించారు. కొద్దిసేపటికి నీళ్ళపై తేలాడిన మల్లికార్జునను వెంటనే ఆసుపత్రికి తరలించినా ప్రయోజనం లేకపోయింది. అప్పటికే ఆ బాలుడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. శ్రీహరి మృతదేహాన్ని స్థానికులు చెరువంతా గాలించి వెలికితీశారు. వీరిద్దరి మరణంతో గిరిజనకాలనీ కన్నీటిసాగర మైంది. చిన్నారుల తల్లిదండ్రుల వేదనారోదనలకు అంతే లేదు. ఈ సంఘటనపై గూడూరు రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుత్‌శాఖకు షాక్ ఇస్తున్న కరోనా

జిల్లా విద్యుత్‌శాఖకు కరోనా షాక్ ఇస్తోంది. గత నాలుగు రోజుల వ్యవధిలోనే ఈ శాఖకు సంబంధించిన ముగ్గురు ఉద్యోగులు కరోనాతో మృత్యువాతపడడం, మరో 18 మంది ఉద్యోగులకు కరోనా పాజిటివ్ రావడంతో విద్యుత్ ఉద్యోగులు హడలెత్తిపోతున్నారు. ఇటీవల నెల్లూరులోని ఏకె నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న నాగరాజునాయక్ కరోనాతో మృతిచెందాడు. ఆ తర్వాత ముత్తుకూరులో విద్యుత్‌శాఖ ఏఇగా పనిచేస్తున్న బి.హనుమారెడ్డి, గూడూరులో లైన్‌మ్యాన్‌గా ఉన్న ఇ.రమణయ్యలు కరోనాతో మృత్యువాత పడ్డారు. దీంతో విద్యుత్ ఉద్యోగులంతా ఎప్పుడు ఏమవుతుందోననే భయంతో బెంబేలెత్తిపోతున్నారు.

## వ్యాక్సిన్ వేయించుకోవడం..సామాజిక బాధ్యత

**- డాక్టర్ సుస్మిత**

కరోనా మహమ్మారి వ్యాధి పెరిగిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతిఒక్కరూ తప్పనిసరిగా కరోనా నివారణకు కోవిడ్ టీకా వేయించుకోవాలని, వ్యాక్సినేషన్ వేయించుకోవడమనేది అందరూ ఒక సామాజిక బాధ్యతగా గుర్తించాలని మెడికవర్ ఆసుపత్రికి చెందిన ప్రముఖ ఊపిరితిత్తుల వ్యాధుల నివారణ నిపుణురాలు డాక్టర్ సుస్మిత చెప్పారు. ఈనెల 18న నెల్లూరులోని మెడికవర్ ఆసుపత్రిలో ఆమె మాట్లాడుతూ వ్యాక్సినేషన్‌పై ఎవరూ అనుమానాలు అపోహలు పెట్టుకోవద్దని, ప్రజలు చైతన్యవంతులై వ్యాక్సిన్ పట్ల అవగాహనతో కరోనా వ్యాధిని నిరోధించేందుకు టీకా వేయించుకోవాలని కోరారు. నోడల్ అధికారి డాక్టర్ అబ్దుల్ హమీద్‌తో పాటు న్యూరో ఫిజిషియన్ డాక్టర్ దీక్షాంత్ నారాయణ్, డాక్టర్ రవీంద్రరెడ్డి, డాక్టర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## 'సేవాభారతి' ఆధ్వర్యంలో రక్తదానం

పొదలకూరు మండలం దేగపూడి గ్రామంలోని సేవాభారతి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 18న రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. యువకులు అనేకమంది ఈ శిబిరానికి వచ్చి రక్తదానం చేశారు. రక్తదానమంటే ప్రాణదానమని, రక్తదానంపై ఎవరికీ ఎలాంటి అపోహలు వద్దని, రక్తదానం చేసి బాధితులు, రోగుల ప్రాణాలు కాపాడడం ఎంతో పవిత్రమైన కర్తవ్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఆరోగ్యంగా ఉన్నవారు ఎవరైనా ఏడాదిలో రెండు మూడు సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. సేవాభారతి మండల కన్వీనర్ గంగవరపు వేణుగోపాల్‌రెడ్డి, దేగపూడి సర్పంచ్ చినఓబుల్‌రెడ్డి, గంటా మల్లికార్జున, రెడ్‌క్రాస్ ప్రతినిధి మధుసూదన్ రావు తదితరులు పర్యవేక్షించారు.

## కొండ బిట్రగుంట క్షేత్రం.. పుష్కరిణి జీర్ణోద్ధరణకు ప్రయత్నాలు

**6 కోట్లతో అంచనాలు సిద్ధం**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన, ఎంతో పురాతనమైన కొండ బిట్రగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి పుష్కరిణి జీర్ణోద్ధరణ కార్యక్రమానికి ఎట్టకేలకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. శిథిలావస్థలో ఉన్న స్వామివారి పుష్కరిణిని బాగుచేసేందుకు ఆలయ కమిటీతో పాటు పలువురు దాతలు ముందుకు రావడంతో ఈ ప్రయత్నాలు ఇప్పుడిప్పుడే ఒక కొలిక్కి వస్తున్నాయి. ఈనెల18వ తేదిన ఆలయ పాలకమండలి ఛైర్మెన్ శ్రీరాం మాల్యాద్రి, ఇంజనీర్ గోపీకృష్ణతో కలసి పుష్కరిణి పునర్నిర్మాణానికి సంబంధించి కొలతలు తీసుకుని నమూనాను తయారుచేశారు. ఒకటి రెండు నెలల్లోనే పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పుష్కరిణి మధ్యభాగంలో మండప నిర్మాణం వగైరాలన్నీ భక్తుల కోరిక మేరకు అద్భుతంగా రూపొందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## శ్రీ వేంకటేశ్వరుని ఆలయం పునరుద్ధరణ

తడ మండలంలోని అక్కంపేట గ్రామంలో ఎంతో ప్రాచీనకాలం నుంచి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఇటీవల గ్రామస్తులు, టిటిడి ఆధ్వర్యంలో అధికారులు అందరూ కలసి పునరుద్ధరించారు. గ్రామస్తులు 30 లక్షల విరాళం ఇవ్వగా, టిటిడి వారు మరో 30 లక్షలు జతచేసి ఆలయాన్ని సుందరంగా నిర్మించారు. ఆలయ పునర్నిర్మాణం పూర్తికావడంతో ఈనెల 29 నుంచి వచ్చేనెల 3వ తేది వరకు ఆలయంలో వైభవంగా మహాకుంభాభిషేకం మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆలయ ప్రధాన అర్చకుడు వినుకొండ రాఘవాచార్యులు తెలిపారు.

## భగవద్ రామానుజాచార్యుల జయంతి వేడుకలు

భగవద్ రామానుజాచార్యుల జయంతి వేడుకలు ఈనెల 18న ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి నిత్యకల్యాణ మండపంలో ప్రత్యేకపూజలు చేశారు. శ్రీ రామానుజాచార్యులవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు సీతారామయ్య స్వామి, పెంచలయ్యస్వామి, అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

## టీచర్లందరికీ టీకా వేయాలి

**- ప్రైవేట్ టీచర్ల సంఘం వినతి**

కరోనా వ్యాధి విపరీతం అవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఆ వ్యాధి బారినపడకుండా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులందరికీ వెంటనే కోవిడ్ టీకా వేయాలని రాష్ట్ర ప్రైవేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ప్రతినిధులు బి.డేవిడ్ చిన్నబాబు, మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. కరోనా వ్యాప్తి దృష్ట్యా పాఠశాలలను మూసివేసి ఉపాధ్యాయులందరికీ టీకా వేయించాలని, కరోనాతో మరణించిన టీచర్ల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాతో పాటు కోవిడ్ బారిన పడుతున్న టీచర్లకు రెండువారాల పాటు స్పెషల్ క్యాజువల్ లీవ్ ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ఆపద్బాంధవి..కావలి కలుగోళ శాంభవి

***త్రిశక్తి స్వరూపిణిగా.. మహా మహిమాన్వితమైన శక్తిగా కావలి కలుగోళ శాంభవి అమ్మవారు ఎంతో ప్రసిద్ధి. అంతేకాదు, శరణన్న వారిని రక్షించే ఆపద్బాంధవిగా, కోరిన కోర్కెలు తీర్చి సకలశుభాలను ప్రసాదించే కరుణామయిగా ప్రతీతి. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలోని కావలి పట్టణంలో ఈ అమ్మవారికి అపురూపమైన ఆలయం ఉంది. భక్తుల కొంగు బంగారంగా వెలసివున్న కలుగోళ శాంభవి మాత ఆవిర్భావం, అమ్మవారి ఆలయ నిర్మాణం వెనుక ఆసక్తికరమైన కథనాలు కూడా ఉన్నాయి.***

కావలి గ్రామదేవత శ్రీ కలుగోళ శాంభవి మాత. అమ్మవారి పుట్టినిల్లు కావలి సమీపంలోని సర్వాయపాళెం గ్రామం. ఆ గ్రామంలోని ఒక రైతు ఇంట్లోని రాగులబొట్టలో అమ్మవారు స్వయంభువుగా ఆవిర్భవించడం జరిగిందని, కోడి కూత, రోకటి పోటు వినిపించని ప్రదేశంలో తనకు ఆలయం నిర్మించాలని చెప్పడంతో భక్తులు ఆ ప్రకారమే అమ్మవారికి ఆలయం నిర్మించారని అంటారు. అమ్మవారి ఆవిర్భావం ఎంతో విచిత్రంగా జరిగిందని కూడా పెద్దలు చెప్తుంటారు. ఆ వివరాలివీ!..

### ఆలయ చరిత్ర:

పూర్వకాలంలో సుమారు అయిదువందల సంవత్సరాల క్రితం కావలి రూరల్ మండలంలోని సర్వాయపాళెం చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో దుష్టశక్తుల పీడ అధికంగా ఉండేదట. దీంతో పాడిపంటలతో కళకళలాడుతున్న ఆ గ్రామాల్లో ఎక్కడ చూసినా కరువు కాటకాలు వచ్చిపడి పొలాలన్నీ బీడుపడిపోయాయి. చివరికి రైతులకు, గ్రామాల్లోని ప్రజలకు అన్నం కూడా దొరకని దయనీయమైన పరిస్థితి ఏర్పడింది. అలాంటి పరిస్థితుల్లో గ్రామస్తులు తమను కాపాడాలంటూ కావలిలో ఉన్న భ్రమరాంబికాదేవి సమేత శ్రీ మల్లికార్జునస్వామివారి ఆలయంలో పెద్దఎత్తున పూజలు చేశారు. దైవాన్ని నమ్ముకుని బీడుభూము









లుగా ఉన్న చేలల్లో రాగులు చల్లి పొలాలను సాగుచేసుకోవాలని ప్రయత్నించారు. అయితే సర్వాయపాళెంలో గ్రామంలో ఉన్న రామిరెడ్డి అనే వ్యక్తి కుటుంబానికి చెందిన పొలంలో తప్ప చుట్టుపక్కల గ్రామాల్లో ఇంకెవరి పొలాల్లోనూ రాగులు పండలేదు. ఇదంతా ఆ అమ్మవారి మహిమేనని అందరూ భావించి ఆ త్రిశక్తి స్వరూపిణిని స్మరించుకుంటూ రామిరెడ్డి పొలంలో పండిన రాగుల్ని రాగుల బొట్టలోంచి తీసి అందరికీ పంచిపెట్టడం ప్రారంభించారు. అయితే ఎంతగా రాగులు తీస్తున్నా అక్షయపాత్రలోంచి వచ్చినట్లుగా ఆ రాగులు మాత్రం తరగడం లేదు. దీంతో ప్రజలంతా ఎంతో ఆశ్చర్యపోయారు. ఇదంతా ఆ దైవశక్తి మహిమేనని అందరూ గ్రహించారు. ఆ రాగులబొట్టను పరిశీలించి చూస్తే దాని అడుగున అమ్మవారి పంచలోహ విగ్రహం కనిపించింది. తళతళ మెరుస్తూ ఎంతో దేదీప్యమానంగా వెలుగొందుతున్న ఆ విగ్రహమూర్తిని చూసి అందరూ అమ్మవారు ఆవిర్భవించారంటూ పెద్దపెట్టున సంతోషం వ్యక్తం చేస్తూ 'అమ్మా తల్లీ..కాపాడమ్మా' అంటూ ప్రార్థించారు. ఆ విగ్రహాన్ని తీసుకువెళ్ళి రామిరెడ్డి నివాసంలో ప్రతిష్ఠించి ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు చేయడం ప్రారంభించారు.

### 'కళ గల అమ్మ'.. కలుగోళమ్మ:

ఆ తర్వాత 'తనది పార్వతిదేవి అంశ అని, తనకు కోడి కూత, రోకలిపోటు వినిపించనంత దూరంలో ఆలయం నిర్మించాలని' అమ్మవారు భక్తులకు స్వప్నదర్శనంలో చెప్పడంతో, అప్పట్లో సర్వాయపాళెం గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కావలి పట్టణంలోని పెద్దలకు రామిరెడ్డి ఆ విషయం తెలియజేశారు. దీంతో అందరూ కలసి అమ్మవారు చెప్పిన విధంగానే ఊరికి దూరంగా ఆలయ నిర్మాణానికి సంకల్పించారు. దాదాపు అయిదు వందల ఏళ్ళ కిందట కావలి పట్టణంలోని పడమరవైపున ఉన్న దట్టమైన అడవిలో సర్వాంగ సుందరంగా ఆలయం నిర్మించి అమ్మవారి మూర్తిని వైభవంగా ప్రతిష్ఠించారు. కాలక్రమంలో ఇప్పుడా ప్రాంతమంతా కావలి పట్టణంలోని ప్రధానప్రాంతంగా ఉండడం విశేషం. అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించే సందర్భంలో అమ్మవారికి నామకరణం చేయాలని పండితుల్ని కోరగా, ఎంతో కళగా ఉన్న అమ్మవారి పేరును 'కళ గల అమ్మ'గా వారు నామకరణం చేశారు. ఆ పేరునే గ్రామప్రజలు వాడుకభాషలో 'కలుగోళమ్మ' అమ్మవారిగా భక్తితో పిలుచుకోవడం ప్రారంభించారు. అమ్మవారికి ప్రత్యేకించి కుంకుమపూజలు, సుమంగళి పూజలు చేస్తే సకల శుభాలు కలుగుతాయని ప్రతీతి. కొత్తదంపతులు ఈ ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించు కోవడం ఆనవాయితీ. ఈ ఆలయంలో ఉన్న బావి ఎంత ఎండాకాలం వచ్చినా ఎండిపోవడం జరగదని, చుట్టుపక్కల ఉన్న బావులన్నీ ఎండిపోయినా ఈ బావిలో మాత్రం నీళ్ళు పుష్కలంగా ఉంటాయని, అమ్మవారి మహిమకు ఇదొక నిదర్శనమని భక్తులు విశేషంగా చెప్తుంటారు.

# విషనాగు వినోద్

## కోటలో ధ్వజమెత్తిన నల్లపరెడ్డి రాజేంద్ర



కోట గ్రామం వేదికగా నల్లప రెడ్డి వినోద్‌పై ధ్వజమెత్తాడు నల్లపరెడ్డి శీనయ్య కుమారుడు రాజేంద్ర. కలిసికట్టుగా ఐకమత్యంతో ఉన్న తమ మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నాడని నల్లపరెడ్డి వినోద్‌రెడ్డిపై ఆరోపణల వర్షం కురిపించాడు. తన కుమారుడు రాహిన్‌రెడ్డి ఇటీవల కోటలో పర్యటిస్తూ తమ తాత నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి గారి సేవా వారసత్వాన్ని కొనసాగించాలని ప్రయత్నం చేస్తున్న తరుణంలో రాహిన్‌కి వస్తున్న జనాదరణ చూసి వినోద్ తట్టుకోలేక పోతున్నాడని ఆరోపించాడు. ఏప్రిల్ 22వతేది గురువారం కోటలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో తండ్రీకొడుకులు రాజేంద్ర, రాహిన్ పాల్గొన్నారు.

వినోద్ మనస్థత్వం, వినోద్ స్థాయి కోట ప్రాంతంలో వినోద్‌కు ఉన్న ఆదరణ ఏంటో గతంలో జరిగిన అనేక సంఘటనలు ఋజువు చేశాయని, నల్లపరెడ్డి కుటుంబం అంతా ఏకమై కృషి చేస్తే కూడా కేవలం 18 ఓట్లతో ఎంపిటిసిగా గెలుపొందాడంటే ప్రజలలో వినోద్‌పట్ల ఉన్న అభిప్రాయానికి ఆ ఎన్నికే నిదర్శనమని రాజేంద్ర అన్నాడు. కేవలం తమ ఇంటిపేరు ఉండబట్టే వినోద్‌ని జనం తిరగనిస్తున్నారని, ఆ సంగతి తెలుసుకుంటే వినోద్‌కే మంచిదని, తనకేదో విపరీతమైన ప్రజాదరణ ఉందనుకుంటే అది వినోద్ భ్రమేనని రాజేంద్ర అన్నాడు.

వినోద్‌ని ప్రసన్నన్న వానపాము అనుకుంటున్నాడని, ఐకమత్యంతో మెలుగుతున్న అన్నదమ్ముల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్న విషనాగుగా వినోద్‌ని పరిగణించాలని తన సోదరుడికి పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేశాడు. ఇటీవల కోటలో జరుగుతున్న సభలు, సమావేశాలకు ప్రసన్నకుమార్‌రెడ్డిని, జగదీష్‌రెడ్డిని పిలుస్తున్న వినోద్ తనను పిలవకపోవడంలోని అంతరార్ధమేమిటో ప్రజలే ఆలోచించుకోవాలని రాజేంద్ర కోరాడు.

## కాలధర్మం

### ఆరుగుంట కోదండరామిరెడ్డి



వ్యాపారవేత్త, హైదరాబాదు నివాసి ఆరుగుంట కోదండరామిరెడ్డి తమ 74వ ఏట ఏప్రిల్ 19వతేదీ సోమవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. కోదండ రామిరెడ్డి స్వస్థలం నెల్లూరు జిల్లా అల్లూరు. కోవూరు వాస్తవ్యులు జెట్టి కృష్ణారెడ్డికి ఈయన అత్యంత సన్నిహితుడు. తన చదువు పూర్తయిన తరువాత చాలాకాలం కోవూరు సుందరమహల్లో కృష్ణారెడ్డి దగ్గర ఉండేవారు. ఆయనకు చేదోడువాదోడుగా హాల్ వ్యవహారాలన్నీ కోదండరామిరెడ్డే చూసుకునేవారు. తరువాతి కాలంలో వ్యాపార నిమిత్తం హైదరాబాదుకు వెళ్లి అక్కడే స్థిరపడిపోయారు. కోదండ రామిరెడ్డి మంచి స్నేహశీలి, మృదుస్వభావి, ఎవరినీ నొప్పించేవారు కాదు. వ్యాపార వేత్తగా బాగా రాణించారు. ఆయనకు భార్య కృష్ణవేణి, కుమారుడు శరత్, కూతురు ప్రశాంతి ఉన్నారు. కోదండరామిరెడ్డి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# ధైర్యమే.. ఆయుధం

(మొదటి పేజీ తరువాయి)

## కోలుకుంటున్నవారు కోట్లల్లోనే ఉన్నారు

కరోనాతో చచ్చిపోయేవారి సంఖ్య లక్షల్లో ఉంటే, కరోనాతో కోలుకునేవారి సంఖ్య కోట్లల్లో ఉంది. ఈ వ్యాధితో చనిపోయే వారి సంఖ్య (30లక్షలా 61వేలు) చూసి మనం హడలిపోతున్నామే కానీ, కరోనాని తట్టుకుని బతుకుతున్నవారి సంఖ్యను పెద్దగా గమనించలేకపోతున్నాం. ప్రపంచంలో ఇప్పటికే కరోనా వ్యాధి బారిన పడినవారు 14 కోట్లా 37లక్షలైతే, కరోనాతో కోలుకుంటున్న వారి సంఖ్య 12 కోట్లా 23 లక్షలమందికి పైగానే ఉంది. అదేవిధంగా మనదేశంలోనూ కరోనా సోకిన వారి సంఖ్య కోటీ 56లక్షల దాకా ఉంటే, కోలుకుంటున్న వారి సంఖ్య సుమారు కోటీ 32 లక్షల దాకా ఉంది. ప్రజలు ఈ భయంకర వ్యాధికి గురవుతున్నా మొక్కవోని ధైర్యంతో ప్రభుత్వాలు, కోట్లాదిమంది వైద్యులు, అధికారులు అందరూ కలసి కరోనాపై పెద్దఎత్తున పోరాటం చేస్తున్నారు. వైద్యులైతే వారి ప్రాణాలను పణంగా పెట్టి మరీ బాధితులకు చికిత్సలు చేస్తూ కాపాడుతున్నారు. దేశవ్యాప్తంగా ఆసుపత్రుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కోవిడ్ పరీక్షలు ప్రతిరోజూ కోట్ల సంఖ్యలో జరుగుతున్నాయి. ఏ మాత్రం కోవిడ్ లక్షణాలు కనిపించినా ఎప్పటికప్పుడు చికిత్సలు ప్రారంభించేస్తున్నారు. ఆసుపత్రుల్లో రోగులకు మందులు, ఇతరత్రా ప్రాథమిక వసతులను ఏర్పాటుచేస్తున్నారు.

## ప్రాణాలను నిలిపే టీకా సిద్ధంగా ఉంది

కరోనా నివారణకు ఇప్పుడు టీకా కూడా వచ్చేసింది. అందువల్ల ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. వ్యాధి తరుముతోంది కదా అని భయపడకుండా, టీకా వేసుకుని వ్యాధిని తరిమికొట్టాలి. కరోనా మొదటిదశ విజృంభించినప్పుడు అనేక దేశాలు అతాలకుతలం అవుతున్నప్పుడు మనదేశం వారికి ధైర్యం చెప్పింది. చేతనైనంత సహకారం అందించింది. ఇప్పుడు రెండో దశలో మనదేశంలో కరోనా ప్రబలుతుండడాన్ని ఇప్పుడు మరికొంతమంది విమర్శిస్తున్నారు. అయినా కరోనా కష్ట కాలంలో భారత్ సేవలు ప్రపంచానికే గర్వకారణంగా నిలిచాయన్న విషయం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో కరోనాను నివారించేందుకు ప్రభుత్వాలు సూచిస్తున్న నియమాలను అమలు చేయడం ఒక్కటే సరైన మార్గం. వ్యాక్సిన్‌ను ఇంకా పూర్తిస్థాయిలో వేసుకోలేదు కనుక కరోనా రాదని చెప్పలేం కానీ ప్రాణాలు పోయే ప్రమాదం నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చన్నది వైద్యుల మాట. అందుకే వ్యాక్సిన్‌ను ప్రతిఒక్కరూ వేసుకోవాలి. మన ప్రాణాల్ని మనమే కాపాడుకోవాలి. వ్యాక్సిన్‌పై లేనిపోని అనుమానాలు పెట్టుకోవడం అనవసరం. కోవిడ్ టీకా ఎంతో సురక్షితం. ఇందులో రెండోమాట లేదు. కోవిడ్‌ను తరిమి కొట్టడానికి.. ఇదే వజ్రాయుధం.

## నిబంధనల పట్ల నిర్లక్ష్యం ప్రమాదకరం

కోవిడ్ నిబంధనలు కరోనా నుంచి మనల్ని కాపాడుకునేందుకు అన్నివిధాలా పరిశీలించి శాస్త్రవేత్తలు, వైద్యనిపుణులు అందించిన సూచనలతో ప్రభుత్వాలు రూపొందించిన నిబంధనలవి. వాటిని ఎంతమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. గుంపులు గుంపులుగా తిరగడం, మాస్కులు లేకుండా ఇష్టం వచ్చినట్లు ఎక్కడంటే అక్కడ తిరగడం, మార్కెట్లు, జనసమ్మర్దం ఉన్న చోట్లలో కూడా మాస్కులు లేకుండా, భౌతికదూరం పాటించకుండా ఉండడం వంటివన్నీ కరోనా సోకడానికి మార్గాలే. నేటికీ అనేక ప్రాంతాల్లో ఎంతోమంది మాస్కులు లేకుండా తిరిగేస్తున్నారు. భద్రతలు పాటించడం లేదు. మన అలక్ష్యమే చివరికి మన మెడకు చుట్టుకుంటుంది. పొరపాటునో గ్రహపాటునో కరోనా అంటుకుందంటే ఇక మన బాధలు ఆ దేవుడికే ఎరుక!...అయినా ఆ బాధలు పగవాడికి కూడా వద్దు. కరోనా మనకు అంటుకోకుండా చూసుకోవడం ఒక్కటే ఉత్తమమైన మార్గం. కోవిడ్ రెండో దశ మరీ విపరీతంగా ఉంటోంది కనుక ప్రభుత్వాలు పదేపదే చెప్తున్న నిబంధనలను ప్రజలంతా తప్పనిసరిగా పాటించి కరోనాను నివారించేందుకు సహకరించాలి. తద్వారా మనల్ని, మన కుటుంబాల్ని, మన చుట్టూ ఉన్న సమాజాన్ని రక్షించుకోవాలి. ఇది ప్రజలందరి సామాజిక బాధ్యత. కోవిడ్ వైరస్ సోకకుండా తరచూ చేతులు సబ్బుతో శుభ్రం చేసుకుంటూ ఉండాలి. శానిటైజర్లు వాడుతుండాలి. అత్యవసరమైతే తప్ప ఇళ్ళలోంచి బయటకు రాకూడదు. ఇళ్ళలో కూడా భౌతికదూరం పాటిస్తుం డాలి. స్వీయనియంత్రణలో ఉండాలి. వ్యాధి నిరోధక శక్తిని పెంచుకునేందుకు ప్రయత్నించాలి. అప్పుడే మనం ఈ మహ మ్మారికి దూరంగా ఉండవచ్చు. అన్నిటికన్నా మించి ధైర్యంతో ఉండాలి. భయపడినంత మాత్రాన ప్రయోజనం ఏమీ ఉండదని తెలుసుకోవాలి. అందుకే కరోనా మన దరిదాపుల్లోకి రాకుండా తరిమికొట్టాలి. ఆత్మస్థైర్యంతోనే విజయం.. భయ పడితేనే అపజయం!.. కనుక ఈ పోరాటంలో మనమే గెలవాలి. కోవిడ్ అంతం కావాలి!.. ధైర్యంతోనే మనం ఈ వ్యాధిని జయించాలి!.. ప్రాణాల కంటే ఏదీ ముఖ్యం కాదు.. మన ప్రాణాలు మన చేతుల్లోనే ఉన్నాయి. వాటిని మనమే కాపాడుకోవాలి. కరోనాపై అలుపెరుగని పోరాటం చేయాలి. అందరం కలసికట్టుగా కరోనాపై యుద్ధం చేయాలి. ఆ యుద్ధంలో మనం కరోనాను జయించి తీరాలి!...

### జిల్లాలో పెరుగుతున్న కరోనా...

కరోనా రెండోదశ వ్యాధి మరింతగా విజృంభిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. ఈనెల 21న ఒక్కరోజే 3765 మందికి కోవిడ్ పరీక్షలు చేస్తే అందులో 934 మందికి కరోనా సోకినట్లు నిర్ధారణ కావడంతో ప్రజలు హడలిపోతున్నారు. ఇదేరోజు మరో ఏడుగురి ప్రాణాలను కరోనా పొట్టన పెట్టుకుంది. దీంతో జిల్లాలో ఇప్పటిదాకా మొత్తం కరోనా కేసుల సంఖ్య 70,373కు చేరుకుంది. మరణాల సంఖ్య 557 దాకా పెరిగింది. ఈ వ్యాధి బారినపడినవారిలో 64,906 మంది వైద్యుల పుణ్యమా అని వారి చికిత్సలతో కోలుకున్నారు.




# రోడ్డెక్కిన పొగాకు రైతులు

## గిట్టుబాటు ధర ఇవ్వాలంటూ బైఠాయింపు



మర్రిపాడు మండల పరిధిలోని డీసీ పల్లి పొగాకు వేలం కేంద్రంలో పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఈనెల 20న రైతులు రోడ్డెక్కి ఆందోళన చేశారు. ముంబయి జాతీయ రహదారిపై కూర్చుని తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడంలో వేలం నిర్వహణ అధికారి సహకరించడం లేదంటూ విమర్శలు చేశారు. వ్యాపారస్తులతో కుమ్మక్కై పొగాకు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని రైతులు మండిపడ్డారు. తొలుత రైతులు ఆందోళనకు దిగి పొగాకు వేలం కేంద్రానికి తాళాలు వేశారు. ఆ తర్వాత జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. రైతులు రోడ్డుపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలు నిలచిపోయాయి. ప్రతి ఏటా పొగాకు రైతులు నష్టాల పాలవుతూనే ఉన్నారని, ఈ ఏడాదైనా ఆ కష్టాల నుంచి గట్టెక్కే అవకాశం లేకపోవడం తమనెంతో ఆందోళనకు గురిచేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కేజీ పొగాకుకు 180 రూపాయలు ఇచ్చారని, ప్రస్తుతం 120 రూపాయలు మాత్రమే ఇవ్వడంతో గిట్టుబాటు లేక తామెంతో నష్టపోతున్నామన్నారు. అంతేకాక వేలం నిర్వహణ అధికారి తమపట్ల పట్ల దురుసుగా ప్రవర్తించి దూషించారంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబమంతా ఆరుగాలం శ్రమించి పొగాకు పంటను పండిస్తే అధికారులు, వ్యాపారస్తుల తీరుతో ప్రతి ఏటా నష్టాలతో ఇబ్బందులు పడాల్సివస్తోందని రైతులు చెప్తున్నారు. గత ఏడాది కూడా ఇలాంటి దుస్థితి ఏర్పడితే రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి కలుగజేసుకుని రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి సమస్యను పరిష్కరించారని గుర్తుచేశారు. పొగాకు బోర్డు ఉన్నతాధికారులు స్పందించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని వారు విజ్ఞప్తిచేశారు.

# ధాన్యం రైతుల ఆందోళన

ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు పురుగుమందు డబ్బా చేతపట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. సంగం మండలంలోని తరుణవాయి గ్రామంలో ఇటీవల జరిగిన ఈ సంఘటన జిల్లా రైతాంగంలో చర్చనీయాంశంగా మారింది. ధాన్యం కొనుగోళ్ళ విషయంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినా తాము ఆశించినట్లుగా న్యాయం జరగడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరుణవాయి గ్రామం పరిధిలో ధాన్యం సాగుచేసుకున్న రైతులు సుమారు వంద పుట్ల ధాన్యం తీసుకుని సంగంలోని కొనుగోలు కేంద్రానికి వస్తే మిల్లర్లకు బ్యాంకు గ్యారంటీ లేదంటూ కొనుగోలు జరగలేదని, దీంతో తాము ఆందోళన చేయడంతో కోవూరులోని ఇంకో రైసుమిల్లుకు ధాన్యం తరలించాలని అధికారులు చెప్పారని, అక్కడికి వెళ్ళినా ప్రయోజనం లేకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని, అయినప్పటికీ మళ్ళీ నెల్లూరు దగ్గరున్న మరో రైసుమిల్లుకి ధాన్యం తరలించాలని చెప్పడంతో మళ్ళీ అక్కడికి వెళ్ళినా ధాన్యం కొనుగోలు చేసేవారు లేరని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పురుగుమందు డబ్బా చేతపట్టి మరీ ఆందోళనకు దిగడంతో పోలీసులు వచ్చి వారిని శాంతింపజేశారు. పౌరసరఫరాల శాఖ అధికారులు వచ్చి ధాన్యం దింపుకోవడంతో రైతులు ఆందోళన విరమించారు.

# వైద్యసేవలు సదా సిద్ధంగా ఉండాలి - కలెక్టర్

జిల్లాలో కోవిడ్ పాజిటివ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కోవిడ్ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, ఆక్సిజన్, వైద్య సిబ్బంది అంతా అందుబాటులో ఉండాలని, బాధితులకు అవసరమైన వైద్యసేవలన్నీ ఎప్పటికప్పుడు అందిస్తుండాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, వైద్యాధికారులను ఆదేశించారు. ఈనెల 21వ తేది కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుండి జాయింట్ కలెక్టర్ డా. ప్రభాకర్‌రెడ్డితో కలసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ మరియు ప్రైవేటు కోవిడ్ హాస్పిటల్స్ ఇంచార్జి అధికారులు, వైద్యాధికారులతో సమావేశమై, కోవిడ్ ఆసుపత్రుల్లో బాధితులకు అందిస్తున్న వైద్య సేవలను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కోవిడ్ లక్షణాలతో హాస్పిటల్‌కు వచ్చిన వెంటనే బాధితులకు జాప్యం లేకుండా వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యం అందించాలని, ఎక్కడా ఎలాంటి ఫిర్యాదులు రాకుండా సేవలందించాలన్నారు. 24గంటలూ వైద్యసేవలు అందించేలా వైద్యులకు, పార మెడికల్ సిబ్బందికి విధులు కేటాయించాలని హాస్పిటల్స్ ఇన్‌చార్జి అధికారులను, వైద్యాధికారులను ఆదేశించారు. కోవిడ్ కేర్ సెంటర్స్‌లో కూడా అవసరమైన మందులు సిద్ధంగా ఉంచడంతో పాటు వైద్యులను, ఇతర పారామెడికల్ సిబ్బందిని అందుబాటులో వుంచాలని, ఆహారం, పారిశుధ్యంపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా. స్వర్ణలత, జి.జి.హెచ్ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దాసు, ప్రిన్సిపల్ డా. సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# కోవిడ్ బాధితుల పర్యవేక్షణకు.. ఐసొలేషన్ సెల్



- డిపిఓ ధనలక్ష్మి

జిల్లాలో కోవిడ్ కేసులు పెరిగిపోతున్న ఈ తరుణంలో కోవిడ్ బాధితుల పర్యవేక్షణకు ప్రత్యేకంగా హోం ఐసొలేషన్ సెల్ ఏర్పాటు చేశామని జిల్లా పంచాయతి అధికారి ధనలక్ష్మి చెప్పారు. ఇటీవల ఆమె నెల్లూరులోని ఐసొలేషన్ కమిటీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హోం ఐసొలేషన్‌లలో ఉన్న కోవిడ్ బాధితుల పర్యవేక్షణకు ఈ ఐసొలేషన్ సెల్ ఏర్పాటుచేశామన్నారు. జిల్లాలోని వార్డు, గ్రామ, మండలస్థాయిల్లోనూ, మునిసిపల్, జిల్లాస్థాయిలోనూ ప్రత్యేక కమిటీలు వేసి ఎప్పటికప్పుడు కోవిడ్ నివారణకు కృషి చేస్తున్నామన్నారు. హోం ఐసొలేషన్‌లో ఉండేవారికి మెడికల్ కిట్‌లు అందజేస్తున్నామని, జిల్లాలో ఇప్పటిదాకా 24,934 మంది హోం ఐసొలేషన్‌లలో ఉండగా 22,387 మందికి మెడికల్ కిట్‌లు, మాస్కులు పంపిణీచేశామని చెప్పారు. ప్రజలందరూ తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, కోవిడ్ నిబంధనలు పాటించి కరోనా నిరోధానికి సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఈక్షణం - మంజీరరెడ్డి

# వి'జ్ఞానశూన్యం'

'బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా రానున్న ఇరవై నాలుగ్గంటల్లో ఈదురు గాలులు, సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచన' వాతావరణ శాఖ నుంచి ఇలాంటి హెచ్చరిక వచ్చిందంటే మత్స్యకారులెవ్వరూ పడవలు తీయరు. వాతావరణం చక్కబడే వరకు ఇళ్లలోనే ఉంటారు. వాళ్లలో నూటికి తొంభై మంది నిరక్షరాస్యులే. అయినప్పటికీ ప్రభుత్వ ప్రకటనను గౌరవిస్తారు. ప్రభుత్వం తమ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని ఈ హెచ్చరిక చేసిందనే గమనింపు వాళ్లలో ఉంటుంది. చదువు లేకపోయినా, చదువుతో వచ్చే తెలివితేటలు లేకపోయినా వాళ్లలో 'బతుకు జ్ఞానం' ఉంటుంది. పాలన వ్యవస్థకు విలువ ఇవ్వాలని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వీకరించాలని, నియమాలను పాటించాలనే తలంపు కూడా ఉంటుంది. మరి... చదువుకున్న వాళ్లలో ఈ 'జ్ఞానం' ఏమవుతోంది? మన పిల్లలకు 'జ్ఞానశూన్యత'ను పెంపొందిస్తున్న చదువులను చెప్పిస్తున్నామా? ఢిల్లీ సంఘటన చూస్తే అవుననక తప్పదేమో!

## వివాదం మీద వివాదం!

కరోనా మరోసారి వికటాట్టహాసం చేస్తోంది. ఢిల్లీలో ప్రభుత్వం వారాంతపు కర్ఫ్యూ విధించింది. కర్ఫ్యూ సమయంలో అత్యవసర సర్వీసులకు తప్ప సాధారణ రాకపోకలకు అనుమతి ఉండదని నిరక్షరాస్యులకు కూడా తెలిసిన విషయమే. ఓ యువజంట మాత్రం ఆదివారం నాడు కొత్తకారులో లాంగ్‌రైడ్‌కి బయలుదేరింది. కర్ఫ్యూ సమయంలో రోడ్డు మీదకు రావడం ఒక తప్పు, కరోనా సమయంలో మాస్కు ధరించడం తప్పనిసరి అయినప్పటికీ ఆ నియమాన్ని పాటించకపోవడం మరో తప్పు. పోలీసులు ఆ కారును ఆపడంతో మొదలైంది వివాదం. కర్ఫ్యూ సమయంలో అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వచ్చిన వారికి స్థానిక ప్రభుత్వ అధికారి కర్ఫ్యూ పాస్ జారీ చేస్తారు. ఈ దంపతుల దగ్గర అలాంటి అనుమతి పత్రం ఏదీ లేదు. 'పాస్ లేదు, మాస్క్ లేదు' అన్నందుకు ఆ దంపతులు పోలీసుల మీద విరుచుకుపడ్డారు. మాస్కు ఎందుకు ధరించాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ఇద్దరిలో భర్త కంటే భార్య ఆగ్రహస్థాయులే ఎక్కువగా కనిపించాయి. దీనికితోడు 'ఇక్కడే నా భర్తను ముద్దు పెట్టుకుంటాను, ఆపుతారా' అంటూ మరో ఆక్షేపణీయమైన వివాదాన్ని కూడా లేవనెత్తిందామె. పై రెండు తప్పులతోపాటు న్యూసెన్స్ కేసు కూడా నమోదు చేయాల్సిన విధంగా వివాదాన్ని తీవ్రతరం చేసిందామె. ఆ ఇద్దరూ ముప్పై ఏళ్ల వాళ్లే అయి ఉంటారు. ఈ తరం విద్యావంతులే. కంప్యూటర్ యుగంలో డిజిటల్ ఎడ్యుకేషన్‌లో నిష్ణాతులే అయి ఉంటారు. ఇండియాలో ఇంట్లో కూర్చుని యూకేలో కంపెనీకి ఉద్యోగం చేయడం తెలిసిన తరం ఇది. ఇంత విజ్ఞానాన్ని సాధించిన ఈ తరం కనీస జ్ఞానాన్ని మాత్రం ఒంటపట్టించుకోవడం లేదు.

### అయ్యో! ఇదేం అజ్ఞానం!!

**నేటి యువత... 'టెక్నాలజీ చదువు తోంది... స్కిల్స్ పెంచుకుంటోంది. సోషల్ సైన్స్ పక్కన పెడుతోంది... సివిక్ సెన్స్ తగ్గించు కుంటోంది. కొన్నిసార్లు పౌరులమనే వాస్త వాన్ని కూడా మర్చిపోతోంది. ప్రశ్నించడం మంచిదే... ప్రశ్నించడం అభివృద్ధికి బాట వేస్తుంది... ధిక్కరించడం వినాశానికి దారి తీస్తుంది. వ్యవస్థలోని లోపాల్ని గుర్తించి వాటిని సరిదిద్దడానికి ప్రశ్నించినప్పుడు యువత ముందుచూపుకు సమాజం సలామ్ చేస్తుంది. అలా చేయకుండా నిబంధనలను పాటించనవసరం లేని కంఫర్ట్ జోన్‌లోకి తమను తాము చేర్చుకునే విధంగా సౌకర్యవంతమైన కోణాన్ని అందుకుని ప్రశ్నించడం ఉంది చూశారూ... అవి సమాజాన్ని, దేశాన్ని అధోగతి పాలు చేసే తెలివితేటలు. 'సాంకేతిక విజ్ఞాన సముపార్జన'కు దీటుగా 'సాంఘిక అజ్ఞాన సముపార్జన'లోనూ దూసుకుపోతున్నట్లుంది.**

## ఇదేం ధిక్కారం?

ప్రపంచంలో ఎక్కడికెళ్లినా నెగ్గుకు రాగలిగినట్లు పిల్లల్ని మెరికలుగా తీర్చిదిద్దాలనే ఆకాంక్ష గత తరం తల్లిదండ్రుల్లో ఎక్కువగా ఉండేది. అమెరికాలో ఉద్యోగం చేయాలంటే ఇండియాలో ఏ కోర్సు చేయాలి? యూకేలో స్థిరపడాలంటే ఏయే డిగ్రీలు ఉండాలి? అనే ఆలోచనలే తప్ప మన పిల్లలు ఏ దేశంలో ఉన్నా సరే 'మనుషులుగా జీవించాలంటే ఏ సంస్కారం నేర్పించాలి' అనే ఆలోచన కరవైంది. ఆ చక్రభ్రమణంలో టెక్నాలజీ ఫ్రంట్‌కోర్‌లోకి వచ్చేసింది. సోషల్ సైన్సెస్ చివరి బెంచికి చేరిపోయాయి. ఒకవేళ ఏ సివిల్స్ టార్గెట్ కోసమో సోషల్ సైన్సెస్ చదివినప్పటికీ లక్ష్యాన్ని చేరే వారి శాతం తక్కువ. మిగిలిపోయిన వాళ్లలో సమాజం పట్ల అసహనంతో రగిలిపోతున్నవాళ్లే ఎక్కువగా ఉంటున్నారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా సరే... దానిని ప్రశ్నించి తీరాలనే భావన ఎక్కువైంది. ప్రశ్నించడం ఎప్పుడూ అభివృద్ధి కారకమే. అందులో సందేహం లేదు. అయితే యువత ప్రశ్నించడానికి ధిక్కరించడానికి మధ్య ఉన్న తేడాను గుర్తించడంలో విఫలమవుతోంది. ఆ తేడా తెలుసుకునే విధంగా పెంచడంలో తల్లిదండ్రులు విఫలమయ్యారు. ఆ వైఫల్యానికి ఒక మచ్చుతునక ఇది. హక్కుల కోసం గళమెత్తే ప్రతి గొంతుక... గళాన్ని విప్పే ముందు తన బాధ్యతను గుర్తెరిగి మసలుకోవాలి. టెక్నాలజీ చదువులు ఈ సూక్ష్మాన్ని అవగతం చేయించడం లేదా? లేకపోతే చదువు తెచ్చిన తెలివితేటలతో యువత ఆ సూక్ష్మాన్ని సౌకర్యంగా మర్చిపోతోందా? ఒక తరం పెంపక వైఫల్యం దేశాన్ని ఎటు నడిపిస్తుందో ఏమో!?


# కావలి రైల్వేస్టేషన్‌కు కొత్త కళ

- ఆధునిక వసతులు ఏర్పాటు




కావలి రైల్వేస్టేషన్ ఆధునిక వసతులు, హంగులతో సర్వాంగ సుందరంగా తయారైంది. మొన్న మొన్నటిదాకా పాతదిగా ఉన్న ఈ రైల్వేస్టేషన్ ఇప్పుడు సరికొత్త కళతో ఆకట్టుకుంటోంది. రైల్వే శాఖ వారు ప్రత్యేకదృష్టిపెట్టి ఈ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేశారు. రైల్వేస్టేషన్‌లోని ప్రవేశ మార్గం, టికెట్ కౌంటర్, ప్లాట్‌ఫామ్‌లను అందంగా తీర్చిదిద్దారు. అధికసంఖ్యలో ప్రయాణీకులు కూర్చునే విధంగా సీటింగ్ ఏర్పాట్లు చేశారు. పాత రైల్వేస్టేషన్ భవనాన్ని తొలగించి కొత్త భవనాన్ని సుందరంగా నిర్మించడంతో చూసేందుకు ఎంతో ముచ్చటగా ఉంది. విజయవాడ-గూడూరు మధ్య నిర్మిస్తున్న 3వ నెంబరు రైల్వేట్రాక్‌ను కూడా కావలి రైల్వే స్టేషన్ పరిసరాల్లో పూర్తిస్థాయిలో నిర్మించారు. ఇందుకోసం కావలి రైల్వేస్టేషన్‌లో ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంను కూడా కొత్తగా నిర్మించడంతో కావలి రైల్వేస్టేషన్‌కు కొత్త కళ వచ్చినట్లయింది.

# వాయుపుత్రుడు మనవాడే



**వాయుపుత్రుడైన హనుమంతుడు మనవాడేనంటూ తిరుమల తిరుపతి దేవస్థానాల వారు ఆధారాలతో సహా నిరూపించడంతో తెలుగుప్రజలు, ముఖ్యంగా ఆంజనేయ స్వామి భక్తులు పులకించిపోతున్నారు. తిరుమల కొండల్లోని 'అంజనాద్రి' పర్వతంలోని జాపాలి తీర్థంలోనే హనుమ పుట్టాడని నిర్ధారించడంతో తెలుగు ప్రజలతో పాటు దేశ వ్యాప్తంగా ఉన్న ఆంజనేయస్వామి భక్తులు, శ్రీరాముని భక్తులంతా మరింత భక్తితో పరవశించిపోతున్నారు.**

## • అంజనాద్రే ఆంజనేయుని జన్మస్థలం
## • తిరుమలలోని జాపాలి తీర్థంలోనే హనుమ జన్మించాడు
## • ప్రకటించిన టిటిడి, పులకించిన ప్రజలు

శ్రీరాముడు జన్మించింది అయోధ్యలో.. అయితే రామభక్తుడైన హనుమంతుడు ఎక్కడ పుట్టాడు?.. అనే విషయంపై భక్తలోకంలో అనేక రకాల చర్చలు, పండితులకు ఎన్నోరకాల అభిప్రాయాలు ఉండేవి. వాటన్నిటినీ ఒక కొలిక్కితెస్తూ.. హనుమంతుని జన్మ స్థలం సాక్షాత్తూ కలియుగ ప్రత్యక్షదైవమైన తిరుమలేశుడు కొలువైవున్న వేంకటాచలం కొండల్లోని అంజనాద్రి పర్వతమని, జాపాలి తీర్థంలోనే హనుమ జన్మించాడని, అదే అంజనాద్రి అని తిరుమల తిరుపతి దేవస్థానాల వారు శ్రీరాముడు పుట్టినరోజైన శ్రీరామ నవమి రోజున అధికారికంగా ప్రకటించి భక్తులందరికీ పరమాన్నం లాంటి పరమానందాన్ని పంచారు.

అటు పండితులు పురాణాలను శోధించగా, ఇస్రో శాస్త్రవేత్తలు తదితరులంతా శాస్త్రజ్ఞానంతో పరిశీలించగా ఈ విషయం నిగ్గుతేలింది. ఈ అంశంపై ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటుచేసి వారిచ్చిన నివేదికను బట్టి హనుమ జన్మస్థలం అంజనాద్రి పర్వతమేనని టిటిడి శాస్త్రబద్ధంగా నిర్ధారించింది. తిరుమలలోని 'నాద నీరాజనం' వేదికపై తమిళనాడు గవర్నర్ భన్వర్‌లాల్ పురోహిత్ సమక్షంలో టిటిడి ఈ చరిత్రాత్మకమైన విషయాన్ని ఈ నెల 21న ప్రకటించింది.

### పురాణాల్లో ప్రస్తావనలు.. శాసనాల ఆధారాలు

పురాణాలను బట్టి చూస్తే శ్రీమద్రామాయణంలోని సుందరకాండలోను, అనేక పురాణాలు, శ్రీ వేంకటాచల మహాత్మ్యం గ్రంథంలోనూ, ఇతర కావ్యాల్లోను హనుమంతుని పుట్టుక గురించి ప్రస్తావనలున్నాయి. రామాయణంలోని సుందరకాండలో తన జన్మ వృత్తాంతాన్ని హనుమంతుడే స్వయంగా సీతామహాదేవికి తెలిపాడని, వాయుదేవుని వలన అంజనాదేవికి తాను జన్మించినట్లు హనుమ పేర్కొన్నాడని ఉన్న ప్రస్తావనలను టిటిడి వివరించింది. తిరుమలలోని శ్రీ వేంకటాచల క్షేత్రాన్నే త్రేతాయుగంలో 'అంజనాద్రి' అని పిలిచేవారు. మతంగ మహర్షి చెప్పినమేరకు ఆకాశగంగ ప్రాంతంలో అంజనాదేవి తపస్సు చేయడంతో పుత్రసంతానం కలిగిందని స్కాంద పురాణంలో ఉంది. అందుకనుగుణంగానే ఈ కొండకు అంజనాద్రి అనే పేరువచ్చింది. ఇక్కడినుంచే బాల హనుమ సూర్యబింబాన్ని పండుగా భ్రమించి దానిని పట్టుకునేందుకు ఆకాశంలోకి లంఘించాడు. శ్రీరాముడి దర్శనానంతరం సీతాన్వేషణలోభాగంగా తిరిగి కొండకు వచ్చి అంజనాదేవిని చూశాడని పురాణాలు చెప్తున్నాయి. అదేవిధంగా వాంగ్మయ, శాసనాల ఆధారం ప్రకారం వాల్మీకి రామాయణానికి తమిళ అనువాదమైన కంబ రామాయణంలోను, వేదాంతదేశికులు, తాళ్లపాక అన్నమాచర్యులు తమ రచనల్లో వేంకటాద్రిని అంజనాద్రిగా వర్ణించారు. స్టాటన్ అనే అధికారి 1800 సంవత్సరం ప్రాంతంలో తిరుమల ఆలయ విశేషాలను ఏర్చికూర్చి 'సవాల్ ఏ జవాబ్' అనే పుస్తకం రాశారని, ఆ పుస్తకంలో కూడా అంజనాద్రి అనే పదాన్ని వివరిస్తూ అంజనాదేవికి ఆంజనేయుడు పుట్టినచోటుగా అంజనాద్రిని ప్రస్తావించాడని ఉంది. ఇలా అనేకరకాల పురాణాల, శాసనాల ఆధారాలను టిటిడి ఏర్పాటుచేసిన పండిత పరిషత్‌తో పాటు శాస్త్రజ్ఞులు కూడా పరిశీలించి హనుమ జన్మస్థలం అంజనాద్రేనని నిరూపించడం జరిగింది. 15వ శతాబ్దంలో విజయరాఘవరాయలు జాపాలిలో నిర్మించిన ఆంజనేయుని ఆలయమే హనుమ పుట్టినచోటని టిటిడి నిర్ధారించింది. జాపాలి మహర్షి ఇక్కడ తపమాచారించి శ్రీ వేంకటేశ్వరుని ప్రసన్నం చేసుకోవడంతో ఈ ప్రాంతానికి జాపాలి తీర్థం అనే పేరు వచ్చిందని పేర్కొంది.

ఈ విషయాలన్నీ నిర్ధారిస్తూ టిటిడి నియమించిన కమిటీకి సంస్కృత విద్యాపీఠం వీసీ మురళీధరశర్మ ఛైర్మెన్‌గా వ్యవహరించారు. ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి సన్నిధానం సుదర్శనశర్మ, ఆచార్య రాణి సదాశివమూర్తి, జానమద్ది రామకృష్ణ, శంకర నారాయణలతో పాటు ఇస్రో శాస్త్రవేత్త రెమెళ్ళ మూర్తి, పురావస్తుశాఖ మాజీ డెప్యూటీ డైరెక్టర్ విజయకుమార్, టిటిడి ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రాజెక్టు అధికారి విభీషణశర్మ సభ్యులుగా ఉండి హనుమ పుట్టుకకు సంబంధించిన అన్ని ఆధారాలను పౌరాణిక, వాంగ్మయ, శాసన, భౌగోళిక ప్రమాణాలతో శోధించి అంజనాద్రే ఆంజనేయుని జన్మస్థలమని నిర్ధారించారు. రెండునెలల్లో ఈ విషయాలను పుస్తక రూపంలో తెస్తామని కూడా టిటిడి ప్రకటించింది.

రామ భక్తుడైన హనుమంతుని జన్మస్థానం తిరుమలగా పరిగణించాలని ఈ సందర్భంగా తమిళ నాడు గవర్నర్ భన్వర్‌లాల్ పురోహిత్ కోరారు.




జననం : 01.07.1938 మరణం : 13.04.2021

## ఉత్తరక్రియలు

పెద్దలు, స్ఫూర్తిప్రదాతలు

**కాటంరెడ్డి వేణుగోపాలరెడ్డి గారు**

తే. 13.04.2021ది మంగళవారం నాడు పరమపదించినారు.
వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

కాటంరెడ్డి హంసవేణి - భార్య

కుమార్తెలు - అల్లుళ్ళు
కందల ప్రశాంతి - కందల బాబా ప్రసాద్‌రెడ్డి
జక్కా లక్ష్మీప్రసన్న - జక్కా శివనారాయణరెడ్డి
యేటూరు ప్రవీణ - యేటూరు వసుధర్‌రెడ్డి

మనుమలు మనుమరాళ్ళు
గిరిధర్‌రెడ్డి, గౌతమి
కళ్యాణ్‌రంగారెడ్డి, స్వాతి, శ్వేత
సందీప్‌రెడ్డి, శ్రేయ

మరియు
ఇతర కుటుంబసభ్యులు

**ఉత్తరక్రియలు :** వారి ఉత్తరక్రియలు తే. 29.04.2021 గురువారం, ఉదయం 10 గంటలకు, హైదరాబాదు, శ్రీశైలంరోడ్డులోని "BTR MAK Projects"లోని క్లబ్‌హౌస్ నందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.


Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, Sub-Editor : MADDURU SRINIVASULU. e-mail: lawyerpatrika@gmail.com